


అనంత
# జనశక్తి
జనం కోసమే మా అక్షరం

18.09.2026
శుక్రవారం | రంగారెడ్డి
సంపుటి : 01 | సంచిక: 79
పేజీలు : 08 | వెల: రూ.5

PUBLISHED BY ANANTAPUR, KADAPA, CHITTOR, VISAKHAPATNAM, SRIKAKULAM, EALLURU, TIRUPATHI, ONGOLE, VIJAYAWADA, NELLORE, PRAKASHAM, GUNTUR, KURNOOL.


## భారత్‌పై ప్రపంచ దేశాల నమ్మకం పెరుగుతోంది

- సెమీకండక్టర్ రంగంలో భారీ సంస్కరణలు
- సెమీకాన్ ఇండియా 2026 సదస్సు
- ప్రారంభించిన ప్రధాని మోదీ
- చిప్ తయారీ నుంచి ఏఐ టెక్నాలజీ వరకు

2లో..



## పెయింట్ వేసుకునే నువ్వు!

**హైదరాబాద్, సెప్టెంబర్ 17, అనంత జనశక్తి న్యూస్**

గోడల మీద పెయింట్ వేసుకునే నీ సంగతి నాకు తెలియదా..కొండారెడ్డిపల్లి పోయి అడిగితే మీ బతుకు మొత్తం బయటపడుతుందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సీఎం రేవంత్ రెడ్డిపై ఫైర్ అయ్యారు. కేసీఆర్‌కు 1000 ఫాం హౌస్ వద్ద ఎకరాలు ఉందని ఒకసారి, నేడు 67 ఎకరాలని మరోసారి సీఎం చెప్పిన అబద్ధాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రగతి భవన్‌లో 150 బెడ్ రూంలు ఉన్నాయని.. బంగారు బాత్రూంలు ఉన్నాయని చేసిన చిల్లర వ్యాఖ్యల్లో ఎంత నిజం ఉందో.. నిన్న రేవంత్ చేసిన ఆరోపణల్లో కూడా అంతే నిజం ఉందన్నారు.

5లో..




- నీ సంగతి నాకు తెలియదా?
- మాజీ మంత్రి కేటీఆర్ సెటైర్లు
- నేను అమెరికాలో ఉద్యోగం చేసి సంపాదించా
- కొండారెడ్డిపల్లి పోయి అడిగితే..
- మీ బతుకు మొత్తం బయటపడుతుంది
- సీఎం రేవంత్ రెడ్డిపై ఫైర్

## ఆదిత్య ఠాక్రేకు రూ.500 కోట్ల లీగల్ నోటీసు

- దిశా సాలియాన్ కేసులో ట్విస్ట్
- సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ మాజీ మేనేజర్ దిశా సాలియన్ మృతి కేసు
- తండ్రి సతీశ్ సాలియాన్ వీడియో

2లో..



# ప్రజల భాగస్వామ్యంతో తెలంగాణ అభివృద్ధి

- సీఎం రేవంత్ రెడ్డి వెల్లడి
- ఆధునిక తెలంగాణ నిర్మాణమే లక్ష్యం
- అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం
- రైతు సంక్షేమానికి పెద్దపీట
- మహిళల ఆర్థికాభివృద్ధిపై దృష్టి
- విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యం
- యువతకు ఉద్యోగ, నైపుణ్య చాన్స్‌లు
- 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల లక్ష్యం
- ఫ్యూచర్ సిటీతో కొత్త తెలంగాణ





**హైదరాబాద్, సెప్టెంబర్ 17, అనంత జనశక్తి న్యూస్**

రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు అభివృద్ధి చేర డానికి నాలుగు కోట్ల ప్రజల భాగస్వామ్యంతో తెలంగాణను ప్రపంచం గర్వించే రాష్ట్రంగా తీర్చిదిద్దుకుందామని ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. తెలంగాణ పోరాట స్ఫూర్తితో ఆధునిక తెలంగాణను నిర్మించుకుం దామని అన్నారు. సెప్టెంబర్ 17 తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకలను పురస్కరించు కుని నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి మాట్లాడారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధికి చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. అభివృద్ధి అన్ని ప్రాంతాలకు చేరాలన్నదే ప్రజాప్రభుత్వ లక్ష్యంగా చెప్పారు. తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా 4 కోట్ల తెలంగాణ ప్రజలకు ము ఖ్యమంత్రి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ప్రజల స్వేచ్ఛ, ఆత్మగౌరవం, హక్కుల కోసం పోరాడిన యోధులకు ఈ చారిత్రక సందర్భంగా ఘనంగా నివాళులు అర్పించారు. "అభివృద్ధి, సంక్షేమంతో పాటు ఆత్మగౌరవం, స్వేచ్ఛ, సమా నత్వం, సామాజిక న్యాయం మా ప్రజా పాలనకు పునాదులు. సెప్టెంబర్ 17వ తేదీ మన బాధ్యతను కూడా గుర్తు చేసే రోజు. ఈ చారిత్రక నేపథ్యం, ఉద్యమాల ఫలాలు ప్రజల జీవితాల్లో కనిపిం చాలి. రైతుకు భరోసా ఉండాలి. మహిళలు ఆర్థి కంగా ఎదగాలి. అట్టడుగు వర్గాలకు న్యాయం జరగాలి. పేద బిడ్డకు మంచి చదువు, మంచి వైద్యం అందాలి. యువతకు ప్రపంచంతో పోటీ పడే అవకాశాలు రావాలి.

తరతరాల అణిచివేత, దోపిడీ, భూస్వామ్య, పెత్తం దారీ విధానాలపై ధిక్కార స్వరం వినిపించిన నేల తెలంగాణ. నిరంకుశ పాలకులకు వ్యతిరేకంగా ప్రాణాలకు తెగించి పోరాడిన యోధులకు పుట్టిని ల్లు తెలంగాణ. అస్తిత్వం, ఆత్మగౌరవం, హక్కుల కోసం ఈ నేల ఎప్పటికప్పుడు ప్రజా చైతన్యాన్ని రగిలించింది.

2లో..

ప్రతీ ఆశీర్వాదం నా సంకల్పాన్ని

## మరింత బలపరుస్తుంది

- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ
- ప్రజల ఆశీస్సులే తనను దేశసేవ వైపు నడిపిస్తున్నాయి

2లో..



## మెల్‌బోర్న్‌లో రోడ్డు ప్రమాదం

### ఇద్దరు విశాఖ వాసులు మృతి

**మెల్‌బోర్న్, సెప్టెంబర్ 17, అనంతజనశక్తి న్యూస్**

ఆస్ట్రేలియా(లోని మెల్‌బోర్న్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు విశాఖవాసులు మృతి చెందారు. విశాఖ కు చెందిన జీటీ ప్రసాద్ తన భార్యతో కలిసి శుభకార్యంలో పాల్గొనేందుకు ఆస్ట్రేలియా వెళ్లారు. మె ల్‌బోర్న్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రసాద్ భార్య, కోడలు మృతి చెందగా.. కారు డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి.

2లో..



## అఫిడవిట్‌లో తప్పులు రాశారా?

- మంత్రి పొంగులేటి
- కేసీఆర్‌కు వందల ఎకరాలుంటే..!
- పదేళ్ల పాలనలో ఉద్యమకారులకు అప్పులే మిగిలాయి

**హైదరాబాద్, సెప్టెంబర్ 17, అనంతజనశక్తి న్యూస్**

బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో ఉద్యమకారులకు అప్పులే మిగి లాయని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఉద్య మకారులకు ఆస్తులు తగ్గితే.. కేసీఆర్ కు రూ.లక్షల కోట్లు వచ్చాయని ఆరోపించారు. సీఎం రేవంత్, ప్రభుత్వంపై కేటీఆర్ విమర్శల నేపథ్యంలో పొంగులేటి స్పందించారు. "2004 వరకు కేసీఆర్‌కు ఒక్క ఎకరా భూమి కూడా లేదు. ఎకరా భూమి కూడా లేదని ఆయన ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నారు.

2లో..

## మమ్మల్ని బలవంతం చేయకండి

- సహాయ శిబిరాల్లో మరణాలపై..
- మణిపూర్ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు వార్నింగ్
- 25 అనుమానాస్పద మరణాలు
- లైంగిక వేధింపుల ఘటనలపై ఆగ్రహం

5లో..

## కొన్ని విభేధాలు కనిపించినా.. వెంటనే సమిసిపోయాయి

- ఎప్పుడూ తేడా కొట్టిందే లేదు: లోకేష్
- టీడీపీ, జనసేన, బీజేపీ మధ్య సమన్వయం బాగుంది
- సమస్యలు తలెత్తితే చర్చల ద్వారా పరిష్కరించుకుంటాం
- తమ మధ్య ఎలాంటి సందేహాలు లేవు

5లో..



**అమరావతి, సెప్టెంబర్ 17, అనంతజనశక్తి న్యూస్**

ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత.. కింది స్థాయిలో అక్కడక్కడ కొన్ని విబేధాలు కనిపించినా.. ఆవి వెంటనే సమసి పోయేలా చర్యలు తీసుకున్నారు.. ఇక, రాష్ట్ర స్థాయిలో అయితే.. ఎప్పుడూ తేడా కొట్టిందే లేదు.. ఈ నేపథ్యంలో.. నెల్లూరు పర్యటనలో మంత్రి నారా లోకేష్ కూటమి పార్టీల మధ్య సమన్వయంపై కీలక వ్యాఖ్యలు చేశారు. టీడీపీ, జనసేన, బీజేపీ భాగస్వామ్య పార్టీల మధ్య సమన్వయం బాగుందని, చిన్నచిన్న సమస్యలు తలెత్తితే చర్చల ద్వారా పరిష్కరిం చుకుంటామని తెలిపారు.

## మహేశ్ గౌడ్, అద్దంకి దయాకర్‌పై హరీశ్ రావు పరువునష్టం దావా

క్షుద్రపూజల ఆరోపణలు.. ఉద్దేశపూర్వకంగానే అసత్య ప్రచారం




**హైదరాబాద్, సెప్టెంబర్ 17, అనంతజనశక్తి న్యూస్**

క్షుద్రపూజలు చేయిస్తున్నారన్న ఆరోపణలపై బీఆర్‌ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రంగా స్పందించారు. తనపై ఉద్దేశపూర్వకంగానే అసత్య ప్రచారం చేస్తున్నారని కాంగ్రెస్ నేతలపై మండిపడ్డా రు. ఈ నేపథ్యంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కు మార్ గౌడ్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్‌కు హరీశ్ రావు ఇప్పటికే లీగల్ నోటీసులు జారీ చేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే/ఎంపీ కోర్టులో పరువు నష్టం దావా వేశారు. దీని దృష్ట్యా హరీశ్ రావు కోర్టులో హాజరై స్టేట్‌మెంట్ ఇవ్వనున్నారు.

2లో..

## 90 శాతం భూముల్లో సాగు కాలేదు

కృష్ణా డెల్టా పరిస్థితిపై పేర్ని నాని కీలక వ్యాఖ్యలు



2లో..

**అమరావతి, సెప్టెంబర్ 17, అనంతజనశక్తి న్యూస్**

కృష్ణా డెల్టాలో సాగునీటి సమస్యపై వైసీపీ కృష్ణా జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి పేర్ని నాని ఆందోళన వ్యక్తం చేశారు. వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌తో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన డెల్టా పరిధిలోని రైతుల పరిస్థితిని వివరించారు.

# మహేశ్ గౌడ్, అద్దంకి దయాకర్‌పై హరీశ్ రావు పరువునష్టం దావా



(మొదటి పేజీ తరువాయి)

కాగా.. కాంగ్రెస్ హయాంలో రాష్ట్రంలో కరవు కాటకాలు రావాలని, దుర్భిక్షం తాండవం చేయాలని బీఆర్ఎస్ నేత హరీశ్ రావు క్షుద్రపూజలు చేయిస్తున్నారని.. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ రావు చేసిన ఆరోపణలు దుమారం రేపుతున్నాయి. ఈ ఆరోపణలను హరీశ్ రావు కొట్టిపారేశారు. రాజకీయ కక్షసాధింపు చర్యలలో భాగంగా ఈ అసత్య ప్రచారాలు, వ్యక్తిగత ఆరోపణలు చేస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు.

# ప్రతీ ఆశీర్వాదం నా సంకల్పాన్ని మరింత బలపరుస్తుంది

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 17,

అనంతజనశక్తి న్యూస్



దేశవ్యాప్తంగా అందుతున్న విషెష్‌పై ప్రధాని నరేంద్ర మోదీ స్పందించారు. తన 76వ పుట్టినరోజు సందర్భంగా వెల్లువెత్తుతున్న శుభాకాంక్షలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. బీజేపీ చేపట్టిన 'ఆశీర్వాద్ కా దియా' కార్యక్రమంపై ఆయన మాట్లాడుతూ.. ప్రజల ప్రేమాభిమానాలు తనను ఎంతగానో ఆకట్టుకున్నాయన్నారు. ప్రజల నుంచి అందుతున్న ఆశీర్వాదాలు దేశసేవ పట్ల తన సంకల్పాన్ని మరింత బలోపేతం చేస్తాయని చెప్పుకొచ్చారు.

మోదీ పుట్టిన రోజును పురస్కరించుకుని గాయని స్నేహా శంకర్, కళాకారుడు అమన్ పంత్ రూపొందించిన 'ఆశీర్వాద్ కా దియా' ప్రత్యేక గీతాన్ని విడుదల చేశారు. మోదీ జన్మ దినంతో పాటు ఆయన 25 ఏళ్ల ప్రజా జీవితాన్ని గుర్తుచేస్తూ ఈ పాటను అంకితం చేశారు. దీనిపై స్పందించిన ప్రధాని.. తనకు లభిస్తున్న ప్రజల ఆశీర్వాదాలు దేశానికి సేవ చేయాలన్న తన నిబద్ధతను మరింత పెంచుతాయని పేర్కొన్నారు.

కాగా.. మోదీ బర్త్‌డే సందర్భంగా నేడు దేశవ్యాప్తంగా ప్రజలు 'ఆశీర్వాద్ కా దియా (ఆశీర్వాద దీపం)' కార్యక్రమం చేపట్టాలని బీజేపీ పిలుపునిచ్చింది. సాయంత్రం 6 నుంచి 7 గంటల మధ్య ఇళ్లలో దీపాలు వెలిగించి మోదీ ఆయురారోగ్యాలు, విజయాన్ని ఆకాంక్షించాలని పార్టీ జాతీయధ్యక్షుడు నితిన్ నబీన్ విజ్ఞప్తి చేశారు. తానూ ఆశీర్వాద దీపం వెలిగిస్తానన్న ఆయన.. ప్రజలు కూడా ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రజా సేవే దేశ సేవ అన్న సూత్రంతో మోదీ పనిచేస్తున్నారని నితిన్ నబీన్ పేర్కొన్నారు. ప్రధానిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూనే కొత్త విధానాలు, కార్యక్రమాలు, పథకాలను తీసుకొచ్చారన్నారు.

ఇక మోదీ పుట్టినరోజు సందర్భంగా 'సేవా సంకల్ప్ అభియాన్' పేరుతో నెల రోజుల ప్రత్యేక కార్యక్రమాన్ని కూడా చేపట్టింది బీజేపీ. నేటి నుంచి అక్టోబరు 17 వరకు ఈ కార్యక్రమం కొనసాగనుంది. రక్తదాన శిబిరాలు, పరిశుభ్రత కార్యక్రమాలు, ప్రదర్శనలు, సదస్సులు, ప్రజా సంబంధ కార్యక్రమాలు వంటివి ఇందులో భాగం కానున్నాయి.

# మెల్‌బోర్న్‌లో రోడ్డు ప్రమాదం



(మొదటి పేజీ తరువాయి)

తన కళ్లెదుటే కారు ప్రమాదంలో భార్య, కోడలు నేహా మృతి చెందటంతో ఆయన తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. జీటీ ప్రసాద్ గతంలో వీడీసీఏలో జాయింట్ సెక్రటరీగా పనిచేశారు. దాదాపు పది రోజుల తర్వాత మృతదేహాలు విశాఖకు చేరుకునే అవకాశముందని సమాచారం.

# అఫిడవిట్‌లో తప్పులు రాశారా?



(మొదటి పేజీ తరువాయి)

కేసీఆర్‌కు ఇప్పుడు వేల కోట్ల ఆస్తులు ఉన్నాయి. ఎన్నికల అఫిడవిట్ ద్వారా కల్వకుంట్ల ముఠా అడ్డంగా దొరికింది. పుట్టుకతోనే కేసీఆర్‌కు వందల ఎకరాలు ఉన్నాయని కేటీఆర్ అంటున్నారు. అలాంటప్పుడు అఫిడవిట్‌లో తప్పులు రాశారా? లేకుంటే ప్రజలకు అబద్ధాలు చెబుతున్నారా? ఉద్యమకారుల త్యాగాల పునాదులపై రూ.లక్షల కోట్ల ఆస్తులు సంపాదించారు'' అని పొంగులేటి ప్రశ్నించారు.

# భారత్‌పై ప్రపంచ దేశాల నమ్మకం పెరుగుతోంది



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 17, అనంత జనశక్తి న్యూస్

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సెమీకాన్ ఇండియా 2026ను ప్రారంభించారు. న్యూఢిల్లీలోని యశోభూమిలో సెప్టెంబర్ 17 నుంచి 19 వరకు ఈ గ్లోబల్ ఈవెంట్ జరగనుంది. 52 దేశాలకు చెందిన 600కు పైగా కంపెనీలు, స్టార్టప్‌లు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నాయి. సెమీకండక్టర్ రంగానికి చెందిన 400 మందికి పైగా ఎగ్జిక్యూటివ్‌లు, స్పీకర్లు, వేలాది మంది సందర్శకులు ఇందులో పాల్గొంటున్నారు. ఈ ఏడాది సెమీకాన్ ఇండియా థీమ్‌గా ను నిర్ణయించారు. సిలికాన్ నుంచి పూర్తిస్థాయి వ్యవస్థల వరకు సెమీకండక్టర్ ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేయడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం.

**భారత్‌పై ప్రపంచ దేశాల నమ్మకం పెరుగుతోంది: మోదీ**

సెమీకాన్ ఇండియా 2026 ప్రారంభోత్సవంలో ప్రధాని మోదీ ప్రసంగించారు. విశ్వకర్మ జయంతి సందర్భంగా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. భారతీయ సంస్కృతిలో విశ్వకర్మను సృష్టి, నిర్మాణానికి దేవుడిగా పూజిస్తారని పేర్కొన్నారు. వికసిత్ భారత్ లక్ష్య సాధన కోసం దేశ ప్రజలంతా కృషి చేస్తున్నారని మోదీ అన్నారు. భారత ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందుతున్న సమయంలోనే ప్రపంచ దేశాలకు భారత్‌పై నమ్మకం కూడా పెరుగుతోందని చెప్పారు. గత కొన్ని రోజులుగా భారత్‌లో చోటుచేసుకున్న అభివృద్ధి కార్యక్రమాలను ఆయన ప్రస్తావించారు. ఏఐ, క్వాంటం టెక్నాలజీ వంటి రంగాల్లో చర్చలు జరుగుతున్నాయని, దేశంలో మౌలిక వసతుల అభివృద్ధి వేగంగా కొనసాగుతోందని తెలిపారు.

**పాలసీల నుంచి కమర్షియల్ చిప్ తయారీ వరకు**

సెమీకాన్ ఇండియా కార్యక్రమం తొలిసారిగా 2021లో ప్రారంభమైంది. అప్పట్లో సెమీకండక్టర్ రంగానికి సంబంధించిన విధానాలపై చర్చలు జరిగాయి. ఆ తర్వాతి సంవత్సరాల్లో ప్రాజెక్టులు, ఒప్పందాలు, శంకుస్థాపనలు, పైలట్ ప్రాజెక్టులపై దృష్టి పెట్టారు. గత ఏడాది పైలట్ ప్రాజెక్టులు, చిప్ నమూనాలపై చర్చించగా, ఈ ఏడాది కమర్షియల్ చిప్ తయారీపై ప్రధానంగా దృష్టిసారించినట్లు ప్రధాని తెలిపారు. గుజరాత్‌లోని సూరత్‌కు చెందిన సూచి సెమీకాన్, పంజాబ్‌లోని మొహాలీకి చెందిన CDIL సంస్థలను ప్రధాని అభినందించారు. భారత సెమీకండక్టర్ ఎకోసిస్టమ్ అభివృద్ధికి కృషి చేస్తున్న పరిశ్రమల ప్రతినిధులు, ఇతర భాగస్వాములకు కూడా శుభాకాంక్షలు తెలిపారు.

**సెమీకండక్టర్ మిషన్ 2.0కు భారీ కేటాయింపులు**

భారత్ తన సెమీకండక్టర్ మిషన్ రెండో దశను ప్రారంభించింది. మొదటి దశ పరిమాణం 8 బిలియన్ డాలర్ల వరకు ఉండగా, రెండో దశకు ప్రభుత్వం 13.5 బిలియన్ డాలర్లను నిర్ణయించినట్లు మోదీ చెప్పారు. భారతీయ చిప్ డిజైన్ కంపెనీలు, స్టార్టప్‌లతో పాటు ప్రపంచంలోని ఇతర సంస్థలు కూడా భాగస్వామ్యం చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. ప్రాజెక్టుల విజయానికి అవసరమైన విధానాలు, ఫ్రేమ్‌వర్క్‌లు, ఇతర చర్యలను ప్రభుత్వం చేపడుతోందని పేర్కొన్నారు.

**సరఫరా గొలుసు బలోపేతంపై ప్రత్యేక దృష్టి**

సెమీకండక్టర్ పరిశ్రమ అభివృద్ధికి సరఫరా గొలుసు కీలకమని ప్రధాని మోదీ అన్నారు. ఈ రంగంలో సరఫరా గొలుసును బలోపేతం చేసేందుకు భారత్‌లో అనేక సంస్కరణలు చేపట్టినట్లు తెలిపారు. చిప్ తయారీకి అవసరమైన రసాయనాలు, ముడి పదార్థాల కోసం గ్లోబల్ కంపెనీలకు భారత్‌లో అనుకూలమైన ఎకోసిస్టమ్ ఏర్పడుతోందని చెప్పారు. భవిష్యత్ డిమాండ్‌కు అనుగుణంగా అవసరమైన ప్రణాళికలు కూడా సిద్ధం చేస్తున్నట్లు వివరించారు. మొదటి దశలో 12 ప్రాజెక్టులకు ఇప్పటికే అనుమతులు లభించాయని, తదుపరి దశలో మరిన్ని ప్రాజెక్టులకు ఆమోదం లభిస్తుందని తెలిపారు. దేశంలో ఇంజినీరింగ్ ప్రతిభకు పెద్ద సంఖ్యలో మానవ వనరులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు.

**ఏఐ అభివృద్ధితో పెరుగుతున్న చిప్ డిమాండ్**

ప్రపంచవ్యాప్తంగా ఏఐ టెక్నాలజీకి డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో సెమీకండక్టర్ రంగం కొత్త సవాళ్లను ఎదుర్కొంటోందని మోదీ తెలిపారు. ట్రాన్సిస్టర్ల పరిమాణం తగ్గుతున్న కొద్దీ టెక్నాలజీ వేగం పెరుగుతోందని అన్నారు. గత రెండేళ్లలో సెమీకండక్టర్ మార్కెట్ వృద్ధి 20 శాతానికి మించి ఉందని పేర్కొన్నారు. ప్రపంచంలోని అనేక కంపెనీలు ఏఐపై దృష్టి సారిస్తున్నాయని, మెమరీ, ప్రాసెసర్ ఇంటిగ్రేషన్‌కు సంబంధించిన సవాళ్లపై పరిశ్రమలు దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని చెప్పారు.

# ఆదిత్య ఠాక్రేకు రూ.500 కోట్ల లీగల్ నోటీసు



హైదరాబాద్, సెప్టెంబర్ 17, అనంతజనశక్తి న్యూస్

దివంగత బాలీవుడ్ నటుడు సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ మాజీ మేనేజర్ దిశా సాలియన్ అనుమానాస్పద మృతి కేసు రాష్ట్ర రాజకీయాల్లో మరోసారి తీవ్ర ప్రకంపనలు సృష్టిస్తోంది. న్యాయం కోసం తానొక తండ్రిగా జరుపుతున్న పోరాటాన్ని రాజకీయ ప్రేరేపితమైనదిగా చిత్రీకరించేందుకు యత్నించారంటూ దిశ తండ్రి సతీశ్ సాలియాన్ సంచలన ఆరోపణలు చేశారు. ఈక్రమంలోనే మహారాష్ట్ర మాజీ మంత్రులు, శివసేన (యూబీటీ) నేత ఆదిత్య ఠాక్రేతో పాటు ఎన్‌సీపీ (ఎస్పీ) నాయకుడు అనిల్ దేశ్‌ముఖ్‌లకు రూ.500 కోట్ల భారీ నష్టపరిహారం కోరుతూ సతీశ్ లీగల్ నోటీసులు జారీ చేశారు.

**క్షమాపణలకు డిమాండ్**

తన కుమార్తెపై సామూహిక అత్యాచారం, హత్య జరిగాయని, దీనిపై చట్టబద్ధమైన సమగ్ర విచారణ జరిపించాలని కోరుతుంటే.. తమ ప్రయోజనాల కోసం తనపై తప్పుడు ఆరోపణలు చేశారని సతీశ్ ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో సీబీఐ ఇప్పటికే విచారణ పూర్తి చేసి ఆదిత్యకు క్లీన్ చిట్ ఇచ్చిందంటూ తప్పుడు ప్రచారం చేశారని నోటీసులో పేర్కొన్నారు. 2025 మార్చి 23వ తేదీన అనిల్ దేశ్‌ముఖ్ మాట్లాడుతూ.. ఈ కేసుఆదిత్య ఠాక్రేను సతాయించడానికి జరుగుతున్న కుట్ర అని వ్యాఖ్యానించడం ద్వారా బాధితుడిని అగౌరవపరిచారని ఆరోపించారు. ఈ క్రమంలోనే వారిద్దరూ ఎలక్ట్రానిక్, ప్రింట్, డిజిటల్ మీడియాతో పాటు తమ అధికారిక సోషల్ మీడియా ఖాతాల్లో కనీసం 3 నిమిషాల వ్యవధితో కూడిన వీడియో ద్వారా బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

**అసలేం జరిగిందంటే?**

2020 జూన్ 8వ తేదీన ముంబయిలోని ఓ భవనంపై నుంచి పడి 28 ఏళ్ల దిశా సాలియన్ మృతి చెందగా.. తొలుత పోలీసులు దీనిని ప్రమాదవశాత్తు జరిగిన మరణంగా కేసు నమోదు చేశారు. ఆరు రోజుల వ్యవధిలోనే నటుడు సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ తన ఫ్లాట్‌లో శవమై కనిపించడం తీవ్ర దుమారం రేపింది. ఆ రోజు ఇంట్లో జరిగిన పార్టీకి ఆదిత్య ఠాక్రే, ఆయన బాడీగార్డులతో పాటు నటులు సూరజ్ పంచోలి, డినో మోరియా హాజరయ్యారని, దిశపై సామూహిక అత్యాచారం జరిగిందనడానికి సాక్ష్యాలు ఉన్నాయని మృతురాలి తండ్రి సతీశ్ సాలియన్ బాంబే హైకోర్టును ఆశ్రయించారు. ఈ పరిణామాల మధ్య ఆరేళ్ల తర్వాత సీబీఐ హత్య, క్రిమినల్ కుట్ర కోణాల్లో ఎఫ్ఐఆర్ నమోదు చేసి ఆదిత్య ఠాక్రే, రియా చక్రవర్తి, డినో మోరియా, సూరజ్ పంచోలి పాత్రలపై విచారణ ముమ్మరం చేసింది.

**ఆరోపణలను ఖండించిన ఆదిత్య ఠాక్రే**

తనపై వస్తున్న తీవ్ర ఆరోపణలపై ఆదిత్య ఠాక్రే సోషల్ మీడియా ద్వారా స్పందించారు. "నా జీవితంలో దిశా సాలియాన్‌ను నేనెప్పుడూ కలవలేదు. ఆమెతో ఎలాంటి పరిచయం కూడా లేదు. గత ఆరేళ్లుగా ఎలాంటి ఆధారాలు లేకుండా రాజకీయ, వ్యక్తిగత ప్రయోజనాల కోసం నా క్యారెక్టర్ అసస్సినేషన్ చేయడానికి కొందరు యత్నిస్తున్నారు. సీబీఐ అధికారిక పునర్విచారణకు ఎలాంటి రాజకీయ అడ్డంకులు సృష్టించకుండా విచారణ సాగనివ్వాలి" అని ఆయన పేర్కొన్నారు.

# 90 శాతం భూముల్లో సాగు కాలేదు




(మొదటి పేజీ తరువాయి)

కృష్ణా డెల్టాలో ఆరు లక్షలకు పైగా ఎకరాల ఆయకట్టు ఉన్నప్పటికీ, ఇప్పటికీ దాదాపు 50 నుంచి 55 వేల ఎకరాల్లో సాగు ప్రారంభం కాలేదని తెలిపారు. సాగు సమయం వచ్చినా నీరు అందక రైతులు పంటలు వేసుకోలేక పొలాలను ఖాళీగా ఉంచాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్ని నాని పేర్కొన్నారు. అవనిగడ్డ, కోడూరు, నాగాయలంక, తోట్లవల్లూరు, మచిలీపట్నం నార్త్ ప్రాంతాల్లో దాదాపు 90 శాతం వరకు సాగు జరగలేదని తెలిపారు. మచిలీపట్నం సౌత్‌లో కూడా సుమారు 40 శాతం భూములు ఇంకా సాగుకు దూరంగా ఉన్నాయని చెప్పారు.

గూడూరు, పెడన, బంటుమిల్లి, కృతివెన్ను ప్రాంతాల్లో దాదాపు 20 వేల ఎకరాల్లో ఇప్పటికీ సాగు ప్రారంభం కాలేదని పేర్ని నాని వివరించారు. గుడివాడ రూరల్, గుడ్లవల్లేరు ప్రాంతాల్లో కూడా వందల ఎకరాలు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. మొక్కలు నాటాల్సిన సమయంలో నీరు అందకపోవడంతో రైతులు పంటలు వేయలేకపోతున్నారని అన్నారు. సాగు ఆలస్యం కావడం వల్ల రైతుల పెట్టుబడులు పెరగడంతో పాటు దిగుబడులపైనా తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని పేర్ని నాని పేర్కొన్నారు. పంటలు వేసిన రైతుల్లో కూడా ఆందోళన కొనసాగుతోందన్నారు. పంటకు అవసరమైన కీలక సమయంలో నీరు అందకపోతే పంటలు ఎండిపోయి, రైతులు పెట్టిన మొత్తం పెట్టుబడి నష్టపోయే ప్రమాదం ఉందని తెలిపారు.

పులిచింతలలో నీటి నిల్వలు ఉన్నప్పటికీ కృష్ణా డెల్టాకు సాగునీరు అందడం లేదని పేర్ని నాని అన్నారు. నీరు ఎప్పుడు వస్తుందనే దానిపై స్పష్టత లేక రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని చెప్పారు. నీరు అందుబాటులో ఉన్నప్పటికీ రైతులకు చేరకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. కృష్ణా డెల్టాలో రైతుల సాగునీటి సమస్యను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని పేర్ని నాని డిమాండ్ చేశారు. ఎక్కడెక్కడ సాగు జరగలేదో క్షేత్రస్థాయిలో పరిశీలించి, అవసరమైన నీటిని విడుదల చేసి రైతులు పంటలు వేసుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇక, సాగునీటి సమస్య ప్రభావం రైతులకే పరిమితం కాదని ఆయన పేర్కొన్నారు. వ్యవసాయ కూలీలు, విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పరికరాలపై ఆధారపడే గ్రామీణ కుటుంబాల ఉపాధిపైనా దీని ప్రభావం పడుతుందని తెలిపారు. అందువల్ల ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకుని కృష్ణా డెల్టాలో సాగునీటి సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు మాజీ మంత్రి పేర్ని నాని..

# ప్రజల భాగస్వామ్యంతో తెలంగాణ అభివృద్ధి

(మొదటి పేజీ తరువాయి)

1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ రాజ్యం అధికారికంగా భారతదేశంలో అంతర్భాగమైంది. రాచరిక పాలన నుంచి ప్రజాస్వామ్య పాలనకు మార్గం తెరుచుకున్న చారిత్రక సందర్భం. అందుకే సెప్టెంబర్ 17ను మనం "ప్రజా పాలన దినోత్సవం"గా జరుపుకుంటున్నాం.

ప్రజా పాలన అంటే ప్రజల మాటకు విలువ ఇవ్వడం... వారి సమస్యలకు పరిష్కారం చూపడం. వారి హక్కులను కాపాడడం. ప్రభుత్వ వనరులు అందరికీ చేరేలా చూడడం. అదే స్ఫూర్తితో ప్రజల ఆత్మగౌరవానికి పట్టం కడుతూ ప్రజా పాలన కొనసాగిస్తున్నాం.

తెలంగాణ ఇప్పుడు పొరుగు రాష్ట్రాలతో కాదు, ప్రపంచంతో పోటీ పడుతోంది. రాష్ట్ర తలసరి ఆదాయం రూ. 4,18,931కు చేరింది. ఇది దేశ తలసరి ఆదాయం కన్నా దాదాపు 91 శాతం అధికం. అభివృద్ధి అంకెల్లో మాత్రమే కాకుండా ప్రజల జీవితాల్లో కనిపించాలన్నదే మా లక్ష్యం.

ప్రజా ప్రభుత్వం రైతు పక్షపాతి. ప్రతి రైతు కుటుంబం సంతోషంగా ఉండాలనే లక్ష్యంతో రూ.2 లక్షల వరకు పంట రుణాలు మాఫీ చేశాం. రూ.20,616 కోట్లు విడుదల చేసి 25.35 లక్షల రైతు కుటుంబాలను అప్పుల ఊబి నుంచి బయటపడేశాం. రైతు భరోసా కింద రూ.36 వేల కోట్లకు పైగా రైతుల ఖాతాల్లో జమ చేశాం. సన్నాలకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ చెల్లించాం.

ప్రభుత్వం ఇచ్చిన మద్దతుతో వరి సాగు విస్తీర్ణం, దిగుబడిలో తెలంగాణ దేశంలోనే నెంబర్‌వన్ స్థానంలో నిలిచింది. 32 నెలల్లో వ్యవసాయం, రైతు సంక్షేమానికి దాదాపు రూ.1 లక్ష 72 వేల కోట్లు ఖర్చు చేశాం. భూ భారతి చట్టం ద్వారా భూ పరిపాలనలో సమగ్ర సంస్కరణలు తీసుకొచ్చాం. భూధార్, ఏఐ ఆధారిత భూమిత్ర సేవలు ప్రారంభించాం. 5 లక్షల 94 వేల మంది రైతులకు పట్టాదార్ పాస్‌బుక్‌లు జారీ చేశాం. కృష్ణా జలాల్లో తెలంగాణకు దక్కాల్సిన వాటా కోసం న్యాయపోరాటం చేస్తున్నాం. పాలమూరు-రంగారెడ్డి, సీతారామ ఎత్తిపోతలు, ఎస్ఎల్‌బీసీతో పాటు ఇతర పెండింగ్ ప్రాజెక్టుల పనులను యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నాం.

తెలంగాణలో ప్రతి ఆడబిడ్డ సగర్వంగా జీవించాలి. ఆర్థికంగా స్వతంత్రంగా ఎదగాలి. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలన్న లక్ష్యంతో మా ప్రభుత్వం పనిచేస్తోంది. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణం కల్పించాం. ఈ ప్రయాణాలతో మన ఆడబిడ్డలకు రూ.12,385 కోట్ల మేర ఖర్చు ఆదా అయింది.

గృహజ్యోతి కింద 53 లక్షలకు పైగా కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. 43 లక్షల కుటుంబాలకు రూ. 500కే వంటగ్యాస్ సిలిండర్ అందిస్తున్నాం. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ ద్వారా 1 లక్ష 68 వేల మంది ఆడబిడ్డలకు రూ. 4,709 కోట్ల సహాయం చేశాం.

4.54 లక్షల స్వయం సహాయక సంఘాలకు రూ.60 వేల 487 కోట్ల బ్యాంకు లింకేజీ, రూ. 1,900 కోట్ల వడ్డీ రాయితీ కల్పించాం. మహిళా మార్ట్‌లు, పెట్రోల్ బంకులు, ఆర్టీసీ అద్దె బస్సులతో మహిళల ఆదాయం పెంచుతున్నాం.

ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా 3.42 కోట్ల మందికి సన్న బియ్యం అందిస్తున్నాం. 15 లక్షలకు పైగా కొత్త స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశాం. 43 లక్షలకు పైగా మందికి సామాజిక భద్రతా పింఛన్లు అందిస్తున్నాం. మేం అధికారంలోకి వచ్చిన తర్వాత పింఛన్ల కింద సుమారు రూ. 31 వేల కోట్లు అందించాం. తాజాగా మరో 2.25 లక్షల మందికి పింఛన్లు ఇచ్చేందుకు రంగం సిద్ధమైంది.

ప్రతి కుటుంబం ఆత్మగౌరవంతో నివసించాలనేది మా ప్రభుత్వ ఆశయం. ఇందిరమ్మ ఇళ్ల తొలి దశలో రూ. 22,500 కోట్లతో 4.50 లక్షల ఇళ్లు మంజూరు చేశాం. ఒక్కో ఇంటికి రూ. 5 లక్షలు అందించాం. రెండో దశలో మరో 2.50 లక్షల ఇళ్లు మంజూరు చేశాం. హైదరాబాద్ నగర పరిధిలో లక్ష ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఇందిరమ్మ టవర్ల నిర్మాణాన్ని ప్రారంభించాం.

సామాజిక అంతరాలను తగ్గించి ప్రతి ఒక్కరికీ న్యాయం చేయాలనే లక్ష్యంతో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ కుల సర్వేను శాస్త్రీయంగా చేపట్టాం. ఆ సర్వే గణాంకాల ఆధారంగా విద్య, ఉపాధి, స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లులను శాసనసభలో ఆమోదించి రాష్ట్రపతి ఆమోదానికి పంపించాం.

గౌరవ సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి దేశంలోనే తొలిసారిగా ఎస్సీ వర్గీకరణ చేపట్టాం. ఫిబ్రవరి 4ను ప్రతి ఏటా "తెలంగాణ సోషల్ జస్టిస్ డే" గా జరుపుకుంటున్నాం. సామాజిక న్యాయం అంటే మాకు నినాదం కాదు. వెనుకబడిన వారిని ముందుకు తీసుకురావడం.

ప్రజా ప్రభుత్వానికి విద్య, వైద్యం రెండు కళ్లలాంటివి. కుల, మత భేదాలు లేకుండా పిల్లలందరికీ నాణ్యమైన విద్య అందాలనే లక్ష్యంతో ప్రతి నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు నిర్మిస్తున్నాం. ఒక్కో నియోజకవర్గంలో 20 నుంచి 25 ఎకరాల్లో సకల వసతులతో వీటి నిర్మాణం చేపడుతున్నాం. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీప్రైమరీ తరగతులు ప్రారంభించాం. ప్రతి నియోజకవర్గంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఉదయం అల్పాహారం, పాలు అందించేందుకు రూ. 927 కోట్లు ఖర్చు చేస్తున్నాం. మధ్యాహ్న భోజనాన్ని 12వ తరగతి విద్యార్థుల వరకు విస్తరించాం. 11 లక్షల మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నాం. విద్యా రంగంలో తీసుకున్న చర్యలతో పర్ఫార్మెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్‌లో తెలంగాణ 28వ స్థానం నుంచి 18వ స్థానానికి చేరుకుంది. ప్రపంచంలోని అత్యుత్తమ విశ్వవిద్యాలయాల ఆఫ్‌షోర్ క్యాంపస్‌లను హైదరాబాద్‌కు తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నాం. అమెరికాకు చెందిన నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీతో పాటు బ్రిటన్‌లోని 17 స్వతంత్ర విద్యా సంస్థల సమాఖ్య యూనివర్సిటీ ఆఫ్ లండన్ తమ ఆఫ్‌షోర్ క్యాంపస్‌ల ఏర్పాటుకు సుముఖత వ్యక్తం చేశాయి.

# చెన్నైలోని నటి శ్రీదేవి ఆస్తి వివాదం.. సుప్రీంకోర్టు సంచలన ఆదేశాలు



దివంగత నటి శ్రీదేవికి చెన్నైలోని ఈస్ట్ కోస్ట్ రోడ్డులో 2.7 ఎకరాల స్థలం ఉంది. అయితే, ఇందులో తమకూ వాటా ఉందంటూ శివకామి అనే మహిళ కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. అయితే, ఇది విచారణకు అర్హత లేదని మద్రాసు హైకోర్టు కొట్టివేసింది. దీంతో పిటిషనర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో సర్వోన్నత న్యాయస్థానం తాజాగా కీలక ఉత్తర్వులు వెలువరించింది. ఈ కేసు యథాతథ స్థితిని కొనసాగించాలని ఆదేశించింది. అలాగే, శ్రీదేవి భర్త బోనీ కపూర్, వారి ఇద్దరు కూమార్తెలకు నోటీసులు జారీచేసింది.

అతిలోక సుందరి, దివంగత నటి శ్రీదేవి కుటుంబానికి చెందిన చెన్నై ఈస్ట్ కోస్ట్ రోడ్‌లోని 2.7 ఎకరాల స్థలం వివాదం మళ్లీ సుప్రీంకోర్టుకు చేరింది. 1988లో శ్రీదేవి కుటుంబం కొనుగోలు చేసిన ఈ ఆస్తిలో తమకు వాటా ఉందంటూ ఒక మహిళ, ఆమె సోదరుడు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టిన అత్యున్నత న్యాయస్థానం.. తదుపరి విచారణ వరకు సదరు ఆస్తిపై 'యథాతథ స్థితి' పాటించాలని ఆదేశించింది. అనంతరం శ్రీదేవి భర్త బోనీ కపూర్, కుమార్తెలు జాన్వీ కపూర్, ఖుషీ కపూర్‌లకు నోటీసులు జారీ చేసింది. మద్రాస్ హైకోర్టు ఈ కేసును కొట్టివేయడంతో, పిటిషనర్ ఎంసీ శివకామి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. జస్టిస్ కే.వి. విశ్వనాథన్, జస్టిస్ అరుణ్ పల్లిలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించింది.

**వాదనలు - పరిణామాలు**

ఎం.సి. చంద్రశేఖరన్ ఆస్తిలో తమకు హక్కు ఉందంటూ పిటిషనర్లు పేర్కొన్నారు. ట్రయల్ కోర్టు ఈ కేసును విచారణకు స్వీకరించినప్పటికీ, మద్రాస్ హైకోర్టు ప్రాథమిక దశలోనే తీవ్రమైన విచారణ జరిపి కేసును కొట్టివేసిందని పిటిషనర్ తరపు లాయర్లు వాదించారు. బోనీ కపూర్ తరపున సీనియర్ అడ్వకేట్ అభిషేక్ మను సింఘ్వి వాదనలు వినిపిస్తూ.. ఈ ఆస్తి రిజిస్ట్రేషన్ 1988 ఏప్రిల్ 19న జరిగిందని తెలిపారు. 2023లో మ్యూటేషన్ అప్లై చేశాక దాదాపు మూడు దశాబ్దాల క్రితం నాటి లావాదేవీని సవాలు చేస్తూ 2025లో ఈ దావా వేశారని, కాలపరిమితి దాటిపోయినందున ఈ కేసు నిలబడదని వాదించారు.

విచారణ సందర్భంగా ఆస్తిని విక్రయించిన ఎం.సి. చంద్రశేఖరన్‌కు అందులో ఐదో వంతు వాటా ఉందా? అని ధర్మాసనం ప్రశ్నించింది. పిటిషనర్లు చంద్రశేఖరన్ పిల్లలు అనే వాదనపై ఏమైనా వివాదం ఉందా? అని కూడా ధర్మాసనం అడిగింది. ఐదో వంతు వాటా మొదటి భార్యకు చెందుతుందని, ఇతర హక్కుదారులు కేవలం వారి వారి వాటాలను మాత్రమే క్లెయిమ్ చేసుకోగలరని సింఘ్వి వివరించారు.

**మధ్యవర్తిత్వానికి సుప్రీం సూచన**

వివాదాన్ని సామరస్యంగా పరిష్కరించుకునేందుకు మధ్యవర్తిత్వం సరైన మార్గమని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. దీనికోసం రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తిని మధ్యవర్తిగా నియమిస్తామని, ఇరు వర్గాలు ఆయన సమక్షంలో చర్చలు జరపాలని సూచించింది. మధ్యవర్తిత్వంలో పురోగతిని సమీక్షించేందుకు ఈ కేసు విచారణను సుప్రీంకోర్టు డిసెంబర్ 18కి వాయిదా వేసింది.

# డ్యూటీ చేయకుండానే నెలకు రూ.70 వేల జీతం ఖాతాలోకి..: కర్ణాటక ఎమ్మెల్యే మేనకోడలి 'నమ్మ క్లినిక్' స్కామ్

కర్ణాటకలోని బాగల్‌కోట్ నమ్మ క్లినిక్లో పని చేస్తున్న ఓ మెడికల్ ఆఫీసర్ తీవ్ర అవినీతి, అక్రమాల ఆరోపణల్లో చిక్కుకున్నారు. ప్రైవేట్ మెడికల్ కాలేజీలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ విద్యను అభ్యసిస్తూనే.. మరోవైపు ప్రభుత్వ నమ్మ క్లినిక్ నుంచి నెలకు రూ. 70,000 పైగా వేతనాన్ని తీసుకుంటున్నట్లు ఆధారాలు వెలుగులోకి వచ్చాయి. ముఖ్యంగా సదరు వైద్యురాలు బాగల్‌కోట్ ఎమ్మెల్యే ఉమేష్ మేటి మేనకోడలు డాక్టర్ అంకిత యార్గల్ అని తెలియడంతో ఈ వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. విధుల పట్ల తీవ్ర నిర్లక్ష్యం వహించడం, ఒకే సమయంలో రెండింటి ద్వారా ప్రయోజనం పొందుతున్నారన్న ఆరోపణలపై ప్రస్తుతం అధికార యంత్రాంగం విచారణ ప్రారంభించింది.

**విధులకు హాజరుకాకుండానే నెల నెలా రూ.70 వేల జీతం!**

డాక్టర్ అంకిత యార్గల్ బాగల్‌కోట్ వాంబే కాలనీలోని నమ్మ క్లినిక్‌లో పని చేస్తున్నారు. ఇందుకోసం ఆమెకు నెలకు రూ.70 వేలకు పైగా జీతం అందుతోంది. అయితే పేరుకే ఆమె అక్కడ పని చేస్తుండగా.. ఒక్కరోజు కూడా ఆమె అక్కడకు వచ్చి విధులు నిర్వహించిన పాపాన పోలేదు. ముఖ్యంగా ఈ ఏడాది మార్చి 3వ తేదీ నుంచి సెప్టెంబర్ వరకు ఆమె ఒక్క రోజు కూడా క్లినిక్‌కు హాజరు కాలేదని అధికారులు జారీ చేసిన నోటీసు ద్వారా తెలుస్తోంది. ఒక



మెడికల్ ఆఫీసర్ లేకుండానే క్లినిక్ కొనసాగడం వల్ల స్థానిక ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. అయినప్పటికీ.. ఎస్ఎన్ మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ నుంచి అనుమతి పొంది ఒక ప్రైవేట్ కాలేజీలో పీజీ చదువుకుంటూనే, క్లినిక్ నుంచి రెగ్యులర్ జీతం పొందుతున్నారని అధికారులు వెల్లడించారు.

**విచారణకు గైర్హాజరు.. సీఈవో తీవ్ర ఆగ్రహం!**

ఈ అక్రమాలపై విచారణ చేపట్టేందుకు బాగల్‌కోట్ జిల్లా పంచాయతీ సీఈవో గజానన్ బలే ఆదేశాలు జారీ చేశారు. అయితే సీఈవో ఎదుట హాజరు కావాల్సిన విచారణకు డాక్టర్ అంకిత డుమ్మా కొట్టారు. దీనిపై తీవ్రంగా స్పందించిన జిల్లా పంచాయతీ సీఈవో.. సెప్టెంబర్ 18వ తేదీన ఉదయం 10 గంటలకు జిల్లా పంచాయతీ కార్యాలయంలోని రూమ్ నంబర్ 11లో జరగబోయే విచారణకు తప్పకుండా హాజరు కావాలని ఆదేశిస్తూ మరో నోటీసు జారీ చేశారు. ఈసారి కూడా విచారణకు రాకపోతే ఏకపక్షంగా నిర్ణయం తీసుకుంటామని స్పష్టమైన హెచ్చరికలు జారీ చేశారు.

**కర్ణాటక మెడికల్ కౌన్సిల్ ఫిర్యాదుకు ఆదేశాలు.. రికవరీకి చర్యలు!**

కర్ణాటక ప్రభుత్వ ఆరోగ్య సంస్థల్లో పనిచేసే రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్ల నిబంధనలకు ఇది తీవ్ర విరుద్ధమని అధికారులు తెలిపారు. నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎమ్‌సీ) ప్రొఫెషనల్ ఎథికల్ కోడ్‌ను ఉల్లంఘించినందున ఆమెపై తీవ్ర క్రమశిక్షణా చర్యలు తీసుకునే అవకాశాలు ఉన్నాయి. వృత్తిపరమైన దుష్ప్రవర్తన కింద ఈ విషయాన్ని 'కర్ణాటక మెడికల్ కౌన్సిల్'

(కేఎమ్‌సీ), ఎన్ఎమ్‌సికి సిఫార్సు చేస్తామని సీఈవో హెచ్చరించారు. అంతేకాకుండా విధులకు హాజరు కాకుండా అక్రమంగా

పొందిన మొత్తం వేతనాన్ని ప్రభుత్వ నిబంధనల ప్రకారం రికవరీ చేస్తామని పేర్కొన్నారు. ఈ వివాదం సంచలనం సృష్టించడంతో జిల్లా వైద్యాధికారి (డీహెచ్ఓ) రాజ్‌కుమార్ యార్గల్ ఆమెను తక్షణమే విధుల నుంచి తొలగించారు.

# గంగమ్మ లాక్కెళితే.. శివయ్యే కాపాడాడు..

## గంగా నదిలో కొట్టుకుపోయి.. 15 రోజుల తర్వాత ప్రాణాలతో బయటపడ్డ మహిళ..

బిహార్‌లోని బక్సర్ జిల్లా కపూర్‌పట్టి గ్రామానికి చెందిన సునయన దేవి(55) అనే మహిళ ఆగస్టు 30న గంగా నదిలో స్నానానికి వెళ్లింది. అయితే ప్రవాహ తీవ్రత ఎక్కువగా ఉండటంతో ఆమె నదిలో కొట్టుకొని పోయింది. దీంతో కుటుంబ సభ్యులు ఆమె కోసం ఆ రోజంతా నది పరిసర ప్రాంతాల్లో గాలించారు. కానీ ఆచూకీ లభ్యం కాకపోవడంతో మరుసటి రోజు ఆమె కుమారుడు గోవింద గోండ్ ఇటార్హి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. కుటుంబ సభ్యులు ఆమెపై ఆశలు వదులుకున్నారు. అయితే వారు ఊహించని రీతిలో అద్భుతం చోటు చేసుకుంది. గంగా నదిలో కొట్టుకుపోయినప్పటికీ.. సునయన దేవికి ఈత రావడంతో ఆమె మునిగిపోలేదు. భారీ వరద కారణంగా నదిలో ప్రవాహం ఎక్కువగా ఉండటంతో.. ఆమె 50 కిలో మీటర్ల దిగువకు కొట్టుకొని వెళ్లారు. ఈత కొడుతూ.. నీళ్లలో మునిగిపోకుండా ప్రాణాలు కాపాడుకున్న దేవి.. ఎట్టకేలకు నీళ్ల మధ్యలో ఉన్న పొలంలోని ఓ గుడిసెలో ఆమె తలదాచుకున్నారు. అయితే చుట్టూ వరద నీరు ఉండటంతో ఆ ప్రాంతం దీవిని తలపించింది. అక్కడి నుంచి బయటకు రావడం ఆమెకు సాధ్యపడలేదు. గంగా నదిలోని నీళ్లను తాగుతూ ప్రాణాలు కాపాడుకున్న ఆమె.. రోజుల తరబడి ఎదురు చూసినప్పటికీ వరద తగ్గుముఖం పట్టకపోవడం.. అటుగా ఎవరూ రాకపోవడంతో.. సోమవారం ధైర్యం చేసి ఈదుకుంటూ అక్కడి నుంచి ఒడ్డుకు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. కొంత దూరం వెళ్లిన తర్వాత ప్రవాహ తీవ్రత ఎక్కువగా ఉండటం, రోజుల తరబడి ఆహారం తీసుకోకపోవడంతో ఈదడం ఆమెకు సాధ్యపడలేదు. దీంతో శివ గురు... శివ గురు అంటూ గట్టిగా కేకలు వేయసాగింది.

దేవి కేకలు విన్న మత్స్యకారులు.. ఎంతో కష్టపడి ఆమెను కాపాడి సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. తర్వాత ఆమెను హల్దీ పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లారు. దేవి నుంచి వివరాలు అడిగి తెలుసుకున్న పోలీసులు.. ఆమె 15 రోజులపాటు ఆహారం తీసుకోకుండా.. కేవలం గంగా నది నీళ్లు తాగి బతికిందని తెలిసి ఆశ్చర్యపోయారు. ఆమె తినడానికి ఆహారం అందించిన పోలీసులు.. ఆ తర్వాత బక్సర్‌లోని ఆమె కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు.

గంగా నదిలో దేవి కొట్టుకుపోయి అప్పటికే రెండు వారాలు దాటడంతో కుటుంబ సభ్యులు ఆమెపై ఆశలు వదిలేసుకున్నారు. అయితే దేవి బతికే ఉందని ఆమె సురక్షితంగానే ఉందని పోలీసులు సమాచారం ఇవ్వడంతో వారి ఆనందానికి హద్దే లేకుండా పోయింది. భర్త ఆమెను హత్తుకొని కంటతడి పెట్టాడు. దేవి ఇక తిరిగి రాదేమో అనుకున్నాం.. కానీ తను బతికే ఉంటుందని మనసులో ఏదో మూలన ఆశ ఉందని ఆయన చెప్పుకొచ్చాడు. కుటుంబ సభ్యులు సంతోషంతో ఆమెను ఇంటికి తీసుకెళ్లారు. 55 ఏళ్ల మహిళ.. గంగా నదిలో వరదలో 50 కిలో మీటర్లు కొట్టుకుపోయినా.. రెండు వారాలపాటు ఒంటరిగా ఓ గుడిసె ఉండాల్సి వచ్చినా.. ఆహారం



లేకపోయినా.. వరద నీళ్లను తాగుతూ తన ప్రాణాలను కాపాడుకున్న తీరు నిజంగా అద్భుతం కదూ. బతకాలన్న సంకల్పం, దైవ భక్తి ఆమెను నడిపించాయి. గంగమ్మ ఆమెను లాక్కొని వెళ్తే.. శివుడి పట్ల ఉన్న అపార నమ్మకంతో ఆమె మరణం అంచుల్లో నుంచి తిరిగొచ్చింది.

**హైదరాబాద్‌లోనూ ఇలాంటి ఘటన..**

ఇలాంటి ఘటనే కొద్ది నెలల క్రితం హైదరాబాద్‌లోనూ చోటు చేసుకుంది. ఇందిర అనే 49 ఏళ్ల మహిళ మే 8వ తేదీ రాత్రి గోల్నాక వద్ద మూసీ నదిలోకి జారి పడిపోయింది. బయటకు వచ్చే అవకాశం లేకపోవడంతో రాత్రంతా చెట్ల కొమ్మలను పట్టుకొని ఉండిపోయింది. తెల్లవారాక స్థానికులు ఆమెను గుర్తించి కాపాడే ప్రయత్నం చేశారు. కానీ సాధ్యం కాకపోవడంతో హైడ్రాకు సమాచారం ఇచ్చారు. దీంతో నిమిషాల వ్యవధిలోనే అక్కడికి చేరుకున్న హైడ్రా సిబ్బంది నిచ్చెన సాయంతో ఆమెను సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు.

# యూపీఐ ఛార్జీలపై రగడ




యూపీఐ ఛార్జీలపై దుమారం రేగుతోంది. అమెరికా ఒత్తిళ్లకు తలొగ్గే కేంద్ర ప్రభుత్వం డిజిటల్ లావాదేవీలపై ఎండీఆర్‌ను (మర్చంట్ డిస్కౌంట్ రేటు) ప్రవేశపెట్టిందని ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఇది ప్రజా వ్యతిరేక చర్యని, వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండు చేశాయి. ట్రంప్‌ను బుజ్జగించడానికి.. అమెరికా కంపెనీల జేబులు నింపడానికే ఎండీఆర్ పేరుతో ఛార్జీలను వసూలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైందని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ విమర్శించారు. అయితే ఈ విమర్శలను కేంద్ర ఆర్థిక శాఖ తోసిపుచ్చింది. ఈ విషయంలో ఎటువంటి విదేశీ ఒత్తిళ్లు లేవని, స్వతంత్రంగా తీసుకున్న నిర్ణయమని స్పష్టం చేసింది. ఎండీఆర్‌పై వెనక్కి తగ్గేది లేదని తేల్చి చెప్పింది.

ఎండీఆర్‌పై 18% వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) వర్తిస్తుంది. ఈ పన్నును లావాదేవీ మొత్తంపై కాకుండా, కేవలం వ్యాపారి చెల్లించే ఎండీఆర్ రుసుముపైనే లెక్కిస్తారు. జీఎస్‌టీ పరిధిలో నమోదైన వ్యాపార సంస్థలకు ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) లభిస్తుంది. దానివల్ల జీఎస్‌టీ నమోదిత వర్తకులకు పన్ను భారం దాదాపు సున్నా అవుతుందని అధికారులు తెలిపారు. పన్ను మినహాయింపు పొందే వస్తువులను విక్రయించే చిన్న వర్తకులు ఈ రుసుమును భరించాల్సి ఉంటుందని వెల్లడించారు.

ఆర్థిక వ్యవహారాల స్టాండింగ్ కమిటీ సమావేశంలో కొందరు ప్రతిపక్ష ఎంపీలు ఈ ఛార్జీలను వ్యతిరేకించారని ఛైర్మన్ భర్తృహరి మెహతాబ్ తెలిపారు. బుధవారం నాటి సమావేశంలో యూపీఐ అంశం లేకపోయినా కొందరు ఎంపీలు ప్రస్తావించారని తెలిపారు. మరో నెలలో కొత్త కమిటీ ఏర్పడుతుందని, అప్పుడు ఈ అంశంపై చర్చిస్తారని ఆయన పేర్కొన్నారు.

**వినియోగదారులపై భారం పడదు: కేంద్రం**

యూపీఐ ద్వారా జరిపే చెల్లింపులకు ప్రజలు ఎటువంటి ఛార్జీలు చెల్లించాల్సిన అవసరం లేదని కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ స్పష్టం చేసింది. "ఎండీఆర్ అనేది వ్యాపారుల చెల్లింపుల వ్యవస్థకు సంబంధించినది. అది వినియోగదారులపై భారం మోపదు. వ్యక్తులు అపరిమిత లావాదేవీలను ఉచితంగా నిర్వహించుకోవచ్చు. వారికి నెలవారీ కోటా లేదు'' అని వివరించింది. నెట్‌వర్క్ భద్రత, ఆధునిక సాంకేతిక మౌలిక వసతుల కల్పన, సైబర్ రక్షణ వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు యూపీఐ వ్యవస్థను ఆర్థికంగా స్వయం సమృద్ధిగా మార్చే లక్ష్యంతోనే.. వాణిజ్య లావాదేవీలపైనే రుసుములు ఖరారు చేసినట్లు ఆర్థిక మంత్రిత్వశాఖ తెలిపింది.


ఎండీఆర్‌పై కాంగ్రెస్ ఫేక్ న్యూస్‌ను ప్రచారం చేస్తోందని, దానివల్ల వినియోగదారులపై ఎటువంటి భారం పడదని భాజపా స్పష్టం చేసింది.

# ఆస్తులు అమ్ముకున్నారు.. అనాథలకు నాన్నయ్యారు!




చెరకు తోటలో ఎవరో విసిరేసిన పసికందును చూసి చలించిపోయారు సంజీవ్ కుమార్ సిన్హా. ఆ పాపని గుండెలకు హత్తుకొని ఇంటికి తీసుకెళ్లారు. భార్య అనురితా కుమారితో కలిసి పాపను కంటికిరెప్పలా కాపాడారు. ఆకాంక్ష అని పేరు పెట్టారు. ఇప్పుడా చిన్నారి మూడో తరగతి చదువుతోంది. బిహార్‌లోని పరవల్పూర్ బ్లాక్ కార్యాలయంలో అంజు కుమారి అనే ఎనిమిదేళ్ల దివ్యాంగ బాలికను కన్నవాళ్లు వదిలేస్తే.. ఇంటికి తీసుకొచ్చి కూతురిలా పెంచి ఇంటర్ వరకు చదివించారు. పెళ్లికి రూ.3 లక్షలు ఖర్చు చేశారు. పక్కింటి బాలుడు అభిషేక్ చిన్నతనంలో తీవ్రమైన న్యుమోనియాతో ప్రాణాపాయ స్థితికి చేరుకున్నప్పుడు కూడా సంజీవ్ కుటుంబం ఆదుకుంది. ఇలాంటి పనుల కోసం తమ పిల్లల కోసం దాచిన పొదుపు మొత్తాలను ఖర్చు చేయడమే కాకుండా రాజ్‌గిర్‌లోని సుమారు రూ.40 లక్షల విలువైన ఆస్తిని సైతం అమ్మేశారు సిన్హా. ఇంత చేసి కూడా ఉద్యోగ విరమణ తర్వాత వచ్చే డబ్బుతో అనాథాశ్రమం, వృద్ధాశ్రమం ఏర్పాటు చేయాలని సంజీవ్ భావిస్తున్నారు.

# అవయవాలు.. ప్రాప్తిరస్తు..!



ముంబయిలోని ప్రసిద్ధ లాల్‌బాగ్‌చా రాజా వినాయక మండపంలో ఏటా విభిన్న సామాజిక అంశాలతో ఉత్సవాలు నిర్వహిస్తుంటారు. ఈసారి గ్లెనెగల్స్ ఆసుపత్రి, లాల్‌బాగ్‌చా రాజా సార్వజనిక్ గణేశోత్సవ్ మండల్ సంయుక్తంగా ఆశల అవయవాలు (ఆర్గాన్స్ ఆఫ్ హోప్) అనే ఇతివృత్తంతో అవగాహన ప్రచారాన్ని చేపట్టాయి. మండపంలో సుమారు 30 అడుగుల ఫైబర్‌గ్లాస్ మానవ అవయవాల శిల్పాన్ని ఏర్పాటుచేశాయి. మరణానంతర అవయవదానంపై ప్రజల్లో అపోహలను తొలగించటమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు స్పష్టం చేశారు. ఈ భారీ ఫైబర్‌గ్లాస్ శిల్పానికి 'అతిపెద్ద మానవ అవయవాల ఫైబర్‌గ్లాస్ నిర్మాణం'గా గిన్నిస్ వరల్డ్ రికార్డ్ లభించిందని తెలిపారు.

# మహువా మొయిత్రాపై కోడిగుడ్లతో దాడి



**సమరయోధురాలిలా ఎదుర్కొన్నానన్న ఎంపీ**

పశ్చిమబెంగాల్‌లోని నాదియా జిల్లాలో పోలీసుల సమక్షంలోనే భాజపా కార్యకర్తలు తనపై కోడిగుడ్లతో దాడిచేశారని తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ మహువా మొయిత్రా ఆరోపించారు. బుధవారం తాను పాల్గొన్న కార్యక్రమం వద్దకు పదిమంది భాజపా కార్యకర్తలు వచ్చి గుడ్లు విసరడం మొదలు పెట్టారని తెలిపారు. తనపై ఇలాంటి దాడి జరగవచ్చని ఇటీవల సుప్రీంకోర్టులో ఆందోళన వ్యక్తంచేసినప్పుడు ధర్మాసనం చేసిన వ్యాఖ్యల్ని ప్రస్తావిస్తూ 'జస్టిస్ దీపాంకర్ దత్తా! మైలార్డ్.. నేనొక సమావేశం కోసం నా నియోజకవర్గానికి వచ్చాను. పోలీసులకు సమాచారం ఇచ్చాను. వాళ్ల సాయంతో భాజపా కార్యకర్తలు నాపై గుడ్లు విసిరారు. మీరు చెప్పిన సలహాను పాటించాను. స్వాతంత్ర్య సమరయోధులు తూటాలను ఎలా ఎదుర్కొన్నారో నేను ఈ గుడ్లను అలా భరించాను. పోలీసుల సమక్షంలోనే నాపై ఇలా గుడ్లు విసరడం కోర్టు ధిక్కరణ చర్య' అని ఎక్స్‌లో పోస్టు చేసిన వీడియో సందేశంలో పేర్కొన్నారు. ఆ వీడియోలో ఆమె ముఖంపై గుడ్డు పెంకులు కనిపించాయి.

# దిల్లీలో పోలీసుల దమనకాండపై కమిటీని మార్చేది లేదు : సుప్రీం

దేశ రాజధానిలో కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆధ్వర్యంలో విద్యార్థులు నిరసనలు చేపట్టినప్పుడు పోలీసులు దమనకాండ సాగించారన్న ఆరోపణలపై విచారణకు ఏర్పాటైన ఐదుగురు సభ్యుల ఉన్నతస్థాయి కమిటీలో మార్పులు చేసేది లేదని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. కమిటీపై చేస్తున్న ఆరోపణలన్నీ ఊహాజనితమని, ముందే ఒక అభిప్రాయానికి వచ్చి.. వాటిని ఆపాదిస్తున్నారని వ్యాఖ్యానించింది. నిష్పాక్షికంగా, పారదర్శకంగా, న్యాయమైన రీతిలో అత్యుత్తమ ప్రమాణాలతో పనిచేసి.. విచారణలో తమకు సహకరించేందుకు కమిటీని ఏర్పాటు చేశామని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చీ, జస్టిస్ వి.మోహనల ధర్మాసనం స్పష్టంచేసింది. ఇంకా విచారణ మొదలుపెట్టకముందే కమిటీపై ముద్ర వేయాలనుకుంటున్నారని, తామైతే ఎలాంటి మార్పు చేయడం లేదని ఈ నెల 10న ఇచ్చిన తీర్పులో తెలిపింది. దీనిని మంగళవారం ఆన్‌లైన్‌లో చేర్చారు. పెల్లెట్ గన్‌ల వాడకం, కొందరిని లక్ష్యంగా చేసుకుని హింసకు పాల్పడటం, విద్యార్థినుల్ని వేధించడం, ఇరువైపులా ఆస్తుల విధ్వంసం వంటి అంశాలపై కమిటీ తన విచారణను చేపట్టవచ్చని పచ్చజెండా చూపింది. సున్నితమైన సాక్షులకు తగిన రక్షణ కల్పించాలని, వారి వివరాలు బహిర్గతం చేయవద్దని తెలిపింది. పిటిషనర్లలో ఒకరి తరఫున న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వాదనలు వినిపిస్తూ విచారణను ఎదుర్కొనే అవకాశం ఉన్న ఒక ఉన్నతస్థాయి వ్యక్తికి కమిటీలో ఒకరు సన్నిహిత మిత్రుడని, అందువల్ల దానిని మార్చాలని కోరారు.




# జీడీపీ వృద్ధికి జీఎస్టీయే ప్రామాణికమా?

భారతదేశ ఆర్థిక వృద్ధిపై మరోసారి చర్చ మొదలైంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో వాస్తవ స్థూల దేశీయోత్పత్తి(జీడీపీ) వృద్ధి 7.8 శాతంగా నమోదైంది. ప్రపంచంలోని ఇతర ప్రధాన ఆర్థిక వ్యవస్థలతో పోలిస్తే ఇది గణనీయమైన పురోగతే. అయితే, దేశంలోని వాస్తవ ఆర్థిక కార్యకలాపాలను ఈ వృద్ధిరేటు ప్రతిబింబిస్తోందా? లేదంటే జీడీపీ సిరీస్, ధరలు, గతేడాది గణాంక సవరణలు కలిసి దీన్ని ఎక్కువగా చూపిస్తున్నాయా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. జీఎస్టీ వసూళ్లను ప్రమాణంగా తీసుకోవడంపైనా భిన్న వాదనలు వినిపిస్తున్నాయి.

గతనెల స్థూల జీఎస్టీ వసూళ్లు రూ.1.99లక్షల కోట్లుగా నమోదయ్యాయి. నిరుడు ఆగస్టుతో పోలిస్తే ఇవి 14.8శాతం అధికం. ఈ ఏడాది ఏప్రిల్-ఆగస్టు కాలంలో మొత్తం జీఎస్టీ వసూళ్లు సుమారు రూ.10.43 లక్షల కోట్లు, అంటే దాదాపు 11శాతం వృద్ధి సాధించాయి. రిఫండ్లను మినహాయించిన నికర జీఎస్టీ వసూళ్లు కూడా ఆగస్టులో 8.3శాతం, ఏప్రిల్-ఆగస్టు మధ్య 9శాతం పెరిగాయి. ఈ గణాంకాలన్నీ ఆర్థిక వ్యవస్థలో పన్ను చెల్లింపులు, అధికారిక లావాదేవీలు, వ్యాపార కార్యకలాపాలు బలంగా ఉన్నాయని సూచిస్తున్నాయి. ఈ-వే బిల్లులూ ఇదే చెబుతున్నాయి. కేంద్ర ఆర్థికశాఖ మాజీ కార్యదర్శి సుభాష్ చంద్ర గార్గ్ మాత్రం- ఆర్థిక వృద్ధిని 7.8శాతంగా నిర్ధారించడానికి జీఎస్టీ వృద్ధి రేటును చూపడం సరికాదంటున్నారు. గతంలో వసూలైన జీఎస్టీ పరిహార సెస్ ప్రస్తుతం కొనసాగడం లేదు. కాబట్టి, నిరుటి వసూళ్లలో ఉన్న ఆ మొత్తాన్ని పరిగణనలోకి తీసుకుంటే ప్రస్తుత జీఎస్టీ వృద్ధిరేటు అధికారికంగా ప్రకటించిన దానికంటే తక్కువగా ఉంటుందన్నది ఆయన అభిప్రాయం. ఆ ప్రకారమైతే, ఏప్రిల్-ఆగస్టు స్థూల జీఎస్టీ వసూళ్లలో వృద్ధి 11శాతం కాకుండా సుమారు 4.08 శాతానికి, నికర వృద్ధి 1.30శాతానికి పడిపోతుంది. ఆగస్టులో 14.8 శాతంగా ఉన్న అధికారిక వృద్ధి సుమారు 7.5శాతానికి తగ్గుతుంది. ఇక్కడ గార్గ్ లేవనెత్తిన అంశం పూర్తిగా విస్మరించదగినదేమీ కాదు. ఏ వృద్ధిరేటునైనా లెక్కించేటప్పుడు గత, ప్రస్తుత సంవత్సర గణాంకాలు ఒకే ప్రాతిపదికపై ఉండాలి. పన్ను వ్యవస్థలో మార్పు వచ్చినప్పుడు దాని ప్రభావాన్ని స్పష్టంగా చూపించాలి.

**కొట్టిపారేయాల్సిన పనిలేదు...**

ఎస్‌బీఐ గ్రూప్ చీఫ్ ఎకనామిక్ అడ్వైజర్ సౌమ్య కాంతి ఘోష్ మాత్రం పరిహార సెస్‌ను గతేడాది జీఎస్టీ బేస్‌లో కలపడం సరి కాదంటున్నారు. అది తాత్కాలిక పన్ను విధానంలో భాగమనీ, ఇప్పుడది కొనసాగడంలేదు గనుక... ప్రస్తుత జీఎస్టీ వ్యవస్థను అంచనా వేయాలంటే ప్రస్తుత సీజీఎస్టీ, ఎస్‌జీఎస్టీ, ఐజీఎస్టీలను గత ఏడాదితో పోల్చడమే సరైన విధానమన్నది ఘోష్ అభిప్రాయం. నిరుడు మేలో టెలికాం స్పెక్ట్రమ్ లావాదేవీకి సంబంధించిన సుమారు రూ.10వేల కోట్ల జీఎస్టీ చెల్లింపు జరిగింది. అటువంటి అసాధారణ సందర్భాలతో కూడిన అధిక బేస్‌తో ఈ ఏడాది మేను పోల్చడం వల్ల ప్రస్తుత వృద్ధిరేటు సహజంగానే తక్కువగా కనిపిస్తుందన్నది ఘోష్ వాదన.

జీఎస్టీ వసూళ్లు దండిగా ఉండటమన్నది ఆర్థిక కార్యకలాపాలు బలంగా ఉన్నాయనేందుకు ఒక సంకేతమే కానీ, జీడీపీ వృద్ధినైతే అది నిరూపించదు. జీఎస్టీ వసూళ్లపై పన్ను, దిగుమతులు, పన్నురేట్లలో మార్పులు, కొత్త రిజిస్ట్రేషన్లు, ద్రవ్యోల్బణం, ఆర్థిక కార్యకలాపాల నిర్మాణం వంటి అనేక అంశాలు కూడా కీలకమైనవే. నిజానికి మొదటి త్రైమాసికంలో నమోదైన 7.8శాతం జీడీపీ వృద్ధిని కొట్టిపారేయాల్సిన పనిలేదు; అలాగని దాన్ని కేవలం ఒక్క ఆధారంతోనే నిర్ధారించుకోవడమూ సరికాదు. కొత్త జీడీపీ సిరీస్‌లో 2022-23ను బేస్ ఇయర్‌గా తీసుకోవడం, మెరుగైన డేటాను ఉపయోగించడం, ధరల కొలతల్లో మార్పులు చేయడం వంటి కారణాలవల్ల లెక్కల్లో మార్పులు వచ్చాయని ప్రభుత్వం, గణాంక సంస్థలు చెబుతున్నాయి. గార్గ్ మాత్రం నిరుడు జీడీపీ స్థాయిలో వచ్చిన సవరణలు ప్రస్తుత వృద్ధిరేటును యాంత్రికంగా పెంచే అవకాశముందని అంటున్నారు. ఈ రెండు వాదనల్లోనూ ఉన్న ముఖ్యాంశం- 'జీడీపీ వృద్ధిరేటు వెనుకనున్న డేటా, ధరల సూచీ, ఉత్పత్తి అంచనాలు, బేస్ ఇయర్, రంగాలవారీ పనితీరు అన్నింటినీ పరిశీలించాలి' అని!

**అదొక్కటే గీటురాయి కాదు...**

ఏతావాతా దేశార్థికం 7.8శాతం వేగంతో వృద్ధి చెందుతోందని చెప్పాలంటే, జీఎస్టీతో పాటు మరికొన్ని సూచికలనూ పరిశీలించాలి. పారిశ్రామిక ఉత్పత్తి ఎలా ఉంది? తయారీ రంగం ఎంత వేగంగా విస్తరిస్తోంది? ప్రైవేటు పెట్టుబడులు పెరుగుతున్నాయా? ఉపాధి అవకాశాలు ఎలా ఉన్నాయి? వాస్తవ వేతనాలు పెరుగుతున్నాయా? కుటుంబాల వినియోగ వ్యయం బలంగానే ఉందా? ఎగుమతులు, ఉత్పాదకత ఎలా ఉన్నాయి? బ్యాంకు రుణాలు, వాహన విక్రయాలు, విద్యుత్ వినియోగం వంటి సూచికలు ఏం చెబుతున్నాయి? అనే ప్రశ్నలు కూడా ముఖ్యమైనవే. వీటికి సానుకూల సమాధానాలు లభిస్తే 7.8శాతం జీడీపీ వృద్ధిపై విశ్వాసం మరింత పెరుగుతుంది. గార్గ్ లేవనెత్తిన అంశాలు గణాంకాల పారదర్శకతకు ఉపయోగపడతాయి. ఘోష్ ప్రస్తావించిన పన్ను వ్యవస్థ మార్పు, బేస్ ప్రభావాలు సైతం గమనార్హమైనవే. భారతదేశ జీడీపీ వృద్ధి ఎంత బలంగా ఉందో నిర్ణయించడానికి జీఎస్టీ ఒక్కటే తుది ప్రమాణం కాదు. వాస్తవ వృద్ధిని అనేక త్రైమాసికాల్లోని ఉత్పత్తి, పెట్టుబడి, ఎగుమతులు, ఉపాధి, వేతనాలు, వినియోగం తదితర సూచికల ద్వారా నిర్ధారించాల్సి ఉంది. ఏదిఏమైనా దేశార్థిక వ్యవస్థ చైతన్యవంతంగా ఉందని జీఎస్టీ వసూళ్లు నిరూపిస్తున్నాయి. అయితే, జీడీపీ గణాంకాలపై విశ్వాసం మరింత పెరగాలంటే- అధికారిక జీఎస్టీ వృద్ధి లెక్కలతో పాటు సవరణలు, రిఫండ్ల తరవాత నికర వృద్ధి ఎంతనేది కూడా ప్రభుత్వం వెల్లడించాల్సి ఉంది.




# ఇజ్రాయెల్ చరిత్ర... హిందూత్వ మూలాలు!

నేడు 'హిందూత్వ'గా పిలుస్తున్న భావజాలానికి మూలాలు నిజానికి ఆధునిక పరిణామాల్లోనే ఉన్నాయి. బ్రిటిష్ వలస పాలనలోకి మారిన భారత ఉపఖండ చరిత్ర, సంస్కృతులు పాశ్చాత్య వలసవాదం వల్ల తీవ్రంగా ప్రభావితమయ్యాయి. పాశ్చాత్య సామ్రాజ్యవాద చరిత్రలో ఇజ్రాయెల్ ఏర్పాటు అత్యంత కీలకమైన ఘట్టం. మొదట బ్రిటిష్‌వారు, ఆ తర్వాత అమెరికా అండదండలతోనే ఇజ్రాయెల్ రూపుదిద్దుకుంది.ఇజ్రాయెల్ ఆవిర్భావం గురించి చర్చలు, సంవాదాలు భారత ఉపఖండంలోనూ విస్తృతంగా జరిగాయి. మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ వంటి జాతీయవాదులు... మొదటి నుంచీ ఒక భూభాగంలో నివసిస్తున్న స్థానిక ప్రజలను నిర్వాసితులను చేస్తూ ప్రత్యేక ఇజ్రాయెల్ ఏర్పడటాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. 1938 నవంబరు 26న గాంధీజీ 'హరిజన్' పత్రికలో 'The Jews' పేరుతో రాసిన వ్యాసంలో నాజీల హింస పట్ల సానుభూతి చూపుతూనే, సైనిక బలంతో పాలస్తీనాను ఆక్రమించడాన్ని ఖండించారు. నాజీల నియంతృత్వానికి ఎదురొడ్డి జర్మన్ యూదులు అహింసాత్మక సత్యాగ్రహం చేపట్టాలని, తద్వారా నాజీల మనసు మార్చవచ్చని గాంధీ సలహా ఇచ్చారు. అయితే గాంధీ వైఖరిని యూదు మేధావులు తీవ్రంగా విమర్శించారు. యూదులు తమ మనుగడ కోసం 'పాత నిబంధన'లోని భౌగోళిక–రాజకీయ ఆక్రమణ సూత్రాలను ఆశ్రయిస్తుంటే, గాంధీజీ మాత్రం వాటిని కొత్త నిబంధనలోని శాంతియుత క్రైస్తవ/అహింసా మార్గంలో



పరిష్కరించుకొమ్మని కోరారు. భవిష్యత్తులో నాజీల వల్ల పీడితులైన యూదులు నాజీలలాగే మారే ప్రమాదాన్ని గుర్తించి ముందుగానే గాంధీ హెచ్చరించారు.

మార్టిన్ బూబర్, హయిామ్ గ్రీన్‌బర్గ్, హెన్రీ పోలక్, హెర్మాన్ కల్లెన్‌బాక్ వంటి యూదు మేధావులు గాంధీజీ అహింసా వాదాన్ని విమర్శించారు. నాజీలు వ్యవస్థీకృతంగా ఒక జాతి నిర్మూలనకు పాల్పడుతున్నప్పుడు అహింసాత్మక నిరసనలు, ఆత్మబలిదానాలు పనిచేయవని, హిట్లర్ లాంటి క్రూరుడికి మన స్సాక్షి ఉండదని మార్టిన్ బూబర్ అన్నారు. అలాగే, ఐరోపాలో తమ 'గెట్టో' స్థితిని భారతదేశపు అస్పృశ్యతతో పోలుస్తూ, దళితుల ఆత్మగౌరవ పోరాటాన్ని గుర్తించిన గాంధీ, యూదుల స్వయం నిర్ణయాధికారాన్ని, పురాతన పితృభూమిపై ఉన్న దైవిక-చారిత్రక హక్కును నిరాకరించడాన్ని గ్రీన్‌బర్గ్ ప్రశ్నించారు. గాంధీజీ భారతీయ హిందూ-ముస్లిం ఐక్యత అనే స్వప్రయోజనం కోసమే జియోనిజాన్ని వ్యతిరేకించారని హెన్రీ పోలక్ విశ్లేషించారు. ఈ సందర్భంలో గాంధీ చేసే అహింసాత్మక వ్యాఖ్యానానికి భిన్నంగా, భగవద్గీత లాంటి హిందూ గ్రంథాలు కూడా హింసను సమర్థిస్తాయి అని యూదు మేధావులు కూడా వాదించడం విశేషం. ఇది నేటి హిందూవాదులు చేసే 'ధర్మహింసా తథైవచ' అనే వాదానికి సరిపోలుతుంది.

ప్రసిద్ధ శాస్త్రవేత్త ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ కూడా ఇజ్రాయెల్ ఆవిర్భావానికి మద్దతు ఇవ్వాలని నెహ్రూను కోరారు. రాజ్యాంగంలో అస్పృశ్యతను నిషేధిస్తున్న భారత ప్రభుత్వం, ఐరోపాలో తీవ్ర వివక్షకు గురవుతున్న యూదులకు ఒక ప్రత్యేక దేశం ఏర్పాటు చేయడంలో సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అయితే నెహ్రూ కానీ, భారత ప్రభుత్వం కానీ దానికి సుముఖంగా లేవు. మధ్యప్రాచ్యంలో ఇటువంటి దేశ ఏర్పాటు అక్కడ నివసిస్తున్న అరబ్బుల ప్రాథమిక హక్కులకు ముప్పుగా పరిణమిస్తుందని నెహ్రూ స్పష్టం చేశారు. మరొకవైపు, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 'జ్యూయిష్ అడ్వకేట్' అనే పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఇజ్రాయెల్ ఏర్పాటును సమర్థించారు. ఆయన సంకలిత రచనలలో ఐరోపాలోని యూదుల 'గెట్టో' స్థితిగతులు, మోజెస్ నాయకత్వంలో.. పీడితులైన యూదులు 'వాగ్దానం చేసిన భూమి'ని చేరుకోవడం వంటి అంశాలను దళితుల విముక్తి పోరాట పోలికలుగా ప్రస్తావించారు. ఇటీవల ఇజ్రాయెల్ దురాక్రమణను దళిత మేధావులు, క్రైస్తవ దళితులు సమర్థించారు. ఈ వైఖరికి పాశ్చాత్య వలసవాద ప్రభావాలు కారణం.

అయితే, వినాయక్ దామోదర్ సావర్కర్ ఇజ్రాయెల్‌ను, యూదు జాతీయవాదాన్ని హిందూత్వతో నేరుగా ముడిపెట్టారు. 1923లో రాసిన గ్రంథంలో సావర్కర్: ''యూదులకు పాలస్తీనా, ముస్లింలకు అరేబియా లాగే... హిందువులకు భరతఖండం పితృభూమి, పుణ్యభూమి'' అని రాశారు. యూదులు పాలస్తీనాపై చూపిన హక్కును, హిందూవాదులు భరతఖండాన్ని తమ సాంస్కృతిక -రాజకీయ భూమిగా క్లెయిమ్ చేసుకోవడానికి నమూనాగా ఉపయోగించారు. 1948లో ఇజ్రాయెల్ ఏర్పడినప్పుడు సావర్కర్ తక్షణ దౌత్య గుర్తింపు ఇవ్వాలని కోరారు. 1954లో 'కేసరి' పత్రికలో- శత్రు దేశాల నడుమ ఉన్నప్పటికీ స్వయం రక్షణ, సైనిక శిక్షణలో ఇజ్రాయెల్ చూపిన ధైర్యాన్ని భారతదేశం ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.

ఆరెస్సెస్ అధికారిక వారపత్రిక 'ఆర్గనైజర్' దశాబ్దాలుగా ఇజ్రాయెల్ విదేశాంగ విధానాన్ని సమర్థిస్తూ వ్యాసాలు ప్రచురించింది. 'పితృభూమి', 'పుణ్యభూమి' సూత్రాలతో ఇజ్రాయెల్ దేశభక్తిని పెంపొందించుకున్నట్లే, భారతదేశం కూడా హిందూ రాష్ట్ర భావన ద్వారా సైనిక, సాంస్కృతిక బలాన్ని పునర్నిర్మించుకోవాలని వాదించింది. డా. సుబ్రమ్మణ్యస్వామి వంటి నాయకులు కూడా ఇరు దేశాల మధ్య బలమైన సైనిక, నిఘా కూటమి ఏర్పడాలని పదే పదే ప్రతిపాదించారు. ఒకప్పుడు నాజీయిజాన్ని సమర్థించిన హిందూవాదులు తర్వాత యూదు ఆధిపత్యాన్ని కూడా సమర్థించారు. ఈ విరుద్ధ దృక్పథాలలో ఉన్న సారూప్యత ఒక్కటే- అది నియంతృత్వం పట్ల ఆరాధనా భావం.

పాశ్చాత్య నమూనాకు 'హిందూత్వ' ప్రతిబింబం మాత్రమే అనేందుకు వీలుగా, ఇజ్రాయెల్‌కు, ఆధునిక హిందూత్వానికి సైద్ధాంతికంగా స్పష్టమైన పోలికలు కనిపిస్తాయి: 1) ఇజ్రాయెల్ యూదులకు దేవుడు వాగ్దానం చేసిన భూమి; భరతఖండం హిందువులకు పితృభూమి/ పుణ్యభూమి. 2) యూదులకు/ పాశ్చాత్యులకు, భారతీయ హిందూత్వవాదులకు ఉమ్మడి శత్రు రూపకల్పన జరగడం. వారే ముస్లింలు. 3) అలాగే జరూసలేంలో సలోమాన్ దేవాలయాన్ని అబ్దుల్ మాలిక్, ముస్లింలు ధ్వంసం చేయడం, తిరిగి ఆలయ నిర్మాణం డిమాండు- బాబర్ రామాలయ విధ్వంస వివాదం, రామాలయం. 4) అఖండ ఇజ్రాయెల్- అఖండ భారత్. బైబిల్ 'పాత నిబంధన'లోని 'దేశం-రక్తం-భూమి' కేంద్రక భావనలతోను, పాశ్చాత్య జాతీయవాద నమూనాలతోను హిందూత్వానికి ఎక్కువ దగ్గరి పోలికలు ఉన్నాయి.

# ఎన్నో నామాలు... ఎన్నెన్నో మర్మాలు!

'గణం' అంటే- బృందం. సమూహం. మొత్తం దేవగణాలకు అధినేత- గణపతి! ఆ ఆధిపత్యాన్ని ఆయన బుద్ధిబలంతో సాధించుకున్నాడు. నెమలి వాహనం మీద రివ్వున ఎగిరి ముల్లోకాలను చుట్టివచ్చిన కుమారస్వామిని- అదే పోటీలో ఓడించాడంటుంది వినాయక వ్రత కథ. 'ఎలుక గుర్రము మీద నీరేడు భువనాలు పరుగెత్తి వచ్చిన పందెకాడు' అన్న కరుణశ్రీ వర్ణనలోని లోగుట్టు అదే! (జీవిత)చదరంగంలో పావులను పడగొట్టాల్సింది- బుద్ధిబలంతోనేకానీ, భుజబలంతో కాదన్నది ఈ కథలో పాఠం! అమ్మానాన్నల చుట్టూ భక్తితో ప్రదక్షిణం చేస్తే ముల్లోకాలనూ (త్రిగుణాలనూ) జయించగలమన్నది- అందులో సూచన. నారములంటే నీళ్లు. నారములయందుండేవాడు నారాయణుడు. నారాయణ నామం జపిస్తూ ప్రదక్షిణాలు చేశాడు కాబట్టే- స్నానంకోసం కుమారస్వామి ఏ నదికి పోయినా వినాయకుడు ఆయనకు ఎదురొచ్చాడు. ఉపద్రవాలో, ఉత్పాతాలో ఎదురైనప్పుడు ఉపాయాలు వెతకాలే తప్ప- బెంబేలు పడరాదన్నది ఇందులోని నీతి. అలాగే, మంత్రశాస్త్రంలోని మొత్తం 32 గణపతుల విభిన్న రూపురేఖలు, గణేశ పురాణంలోని 92 అధ్యాయాల ఉపాసనాఖండం, 155 అధ్యాయాల క్రీడాఖండాలు చెబుతున్నదల్లా- అంతరార్థాలను, తత్త్వాన్ని గుర్తించమనే!

అమ్మ పసుపుబొమ్మను చేసింది. అయ్య ఏనుగు తలను పెట్టాడు. 'తొండమును ఏకదంతమును తోరపుబొజ్జ'తో కనపడే ఆ గజముఖుడే పురాణగణపతి. 'త్వం మూలాధార స్థితోసి నిత్యమ్' అంటూ అధర్వశీర్షం కీర్తించింది వేదగణపతిని! ఆయన గజముఖుడు కాదు. 'కవిం కవీనాం ఉపమశ్రవ స్తవం...' అంటూ గణపతిని 'విద్యాధిదేవత'గా స్తుతించింది వేదం. రుద్రుడి దగ్గరుండే హేరంబగణపతిని 'విశిష్ట మంత్రమూర్తి' అన్నాయి మంత్రశాస్త్రాలు. 'త్రికోణ మధ్యగతుడు' అంటాయి తంత్రశాస్త్రాలు. సృష్టిలో ప్రతిదానికీ పుట్టుక, మనుగడ, మరణం సర్వసహజం. ఆ మూడూ ఉన్నదాన్ని 'జగత్తు' అనీ, లేనిదాన్ని 'బ్రహ్మము' అనీ చెబుతాయి ఉపనిషత్తులు. ఓంకారం పరబ్రహ్మస్వరూపం. గణపతిని ఓంకారాత్మకుడిగా సంభావించారు శంకర భగవత్పాదులు. 'వాతాపి గణపతిం భజే' ప్రసిద్ధకృతిలో 'ప్రణవ స్వరూప వక్రతుండం' అని ముత్తుస్వామి దీక్షితర్ చెప్పిన ప్రణవమంటే ఓంకారమే! కాబట్టి వినాయకుడు 'శబ్ద బ్రహ్మస్వరూపుడు' అనేది పెద్దల తీర్మానం. గణపతి తత్త్వాన్ని అర్థం చేసుకోవాలనుకుంటే ఈ భేదాలను జాగ్రత్తగా అధ్యయనం చేయాలి. పరబ్రహ్మతత్త్వాన్ని పట్టుకోవడమే గణపతి ఆరాధనల పరమ లక్ష్యం!

లోకకల్యాణం కోసం అవతారాలను, స్త్రీరూపాలను ధరించడం దేవుళ్లకు ఆనవాయితీ. వినాయకి, గజానని, విఘ్నేశ్వరి, గణేశ్వరి, ప్రజాదేవి... వంటివి వినాయకుడి స్త్రీరూపాలు. సప్తమాతృకల గురించి తెలిసిందే. తోడుగా మహాలక్ష్మిని ఎనిమిదిగా, 'వినాయకి'ని తొమ్మిదో మాతృకగా ఆరాధించడం ఆచారం. విఘ్ననాయకుని శక్తిరూపమే 'వినాయకి' అంటుంది దేవీపురాణం. ఆమెనే 'ప్రజాదేవి'గా పిలిచింది ముద్గలపురాణం. కాశీని రక్షించేందుకు శివుడు నియమించిన శక్తుల్లో విఘ్నేశ్వరి ఒకరని స్కాందపురాణం చెబుతోంది. తమిళనాడులోని మధురమీనాక్షి ఆలయంలో ఆమెను దర్శించవచ్చు. శుచీంద్రంలో పూజలందుకొనేది 'గణేశ్వరి'. మనుచరిత్రలో పెద్దన 'అంకము చేరి శైలతనయా స్తనదుగ్ధములు ఆనువేళ' పద్యంలో ఇమిడ్చిన అర్ధనారీశ్వర తత్త్వం అర్థమైతే దానిలోంచే ఆవిర్భవించిన గణపతికి చెందిన స్త్రీతత్త్వం కూడా తేలిగ్గా బోధపడుతుంది. గాజులు, నగలు, వంకీలు, వడ్డాణాలూ... విడివిడిగా ఉన్నప్పుడే ఆ పేర్లు. అన్నింటినీ కలిపి కరిగించేస్తే, అది బంగారపు ముద్ద! విడిగా పూజించేందుకే వినాయకుడికి ఆ పేర్లు. అవన్నీ కలిసిపోతే, ఆ ముద్ద గణేశతత్త్వం! 'శివశివమూరితివి' అంటే వేదగణపతి. 'శివుని కుమారుడవు' అన్నప్పుడు పురాణగణపతి! వడ్లగింజలో బియ్యపు గింజ! చదవాల్సింది వ్రతకథను. చూడాల్సింది దేవుణ్ని. చేదుకోవాల్సింది ఆ లోపలి తత్త్వాన్ని!

# ఆగని యుద్ధం... తీరని నష్టం!

మహోద్ధృతంగా వినిపిస్తున్న యుద్ధభేరీ నాదాల నడుమ పేదసాదల ఆకలి కేకలు అరణ్య రోదనమవుతున్నాయి. పశ్చిమాసియాలో రాజుకున్న ప్రాంతీయ ఉద్రిక్తతలు అంతర్జాతీయ సంక్షోభ జ్వాలలై దేశదేశాల సౌభాగ్యాన్ని హరిస్తున్నాయి. కొవిడ్ కవుకుదెబ్బల నుంచి ప్రపంచం కోలుకుంటున్న దశలో పులి మీద పుట్రలా ఉక్రెయిన్ యుద్ధం దాపురించింది. అమెరికా, ఇజ్రాయెల్ ఏకమై ఇరాన్‌పై దండెత్తడం నష్టతీవ్రతను ఇంకా పెంచేసింది. ఈ యుద్ధం మూలంగా 2026లో ప్రపంచార్థిక వృద్ధిరేటు 2.6శాతానికి పరిమితమవుతుందని, ద్రవ్యోల్బణం 4శాతానికి పెరుగుతుందని వరల్డ్ బ్యాంక్ ఇటీవల అంచనా వేసింది. ఇంధన సరఫరాల్లో అవాంతరాలు అధికమైతే వృద్ధిరేటు 1.3శాతానికి పడిపోతుందనీ, ధరోల్బణం 4.4శాతానికి చేరుతుందనీ ఆ సంస్థ హెచ్చరించింది. ఆయిల్ ధరలు అదుపు తప్పితే ద్రవ్యోల్బణం 5.4శాతానికి పెరగవచ్చునని ఐఎంఎఫ్ లెక్కగట్టింది. సౌదీపై హూతీల ఎడతెగని దాడుల కారణంగా హర్మూజ్ జలసంధికి ప్రత్యామ్నాయ మార్గాల్లోనూ ప్రస్తుతం చమురు రవాణాకు ఆటంకాలు ఏర్పడుతున్నాయి. ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్‌లు ఊహించిన ప్రమాదాలను అవి కళ్లముందు నిలుపుతున్నాయి!



ఇరాన్‌పై కయ్యానికి కాలుదువ్వినప్పటి నుంచి మొన్న జులై వరకు అమెరికా దాదాపు 3750కోట్ల డాలర్లు ఖర్చు చేయాల్సి వచ్చింది. తమకు అదో పెద్ద లెక్క కానేకాదంటూ కొద్దిరోజుల క్రితం డంబాలు పలికిన డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌పై దండయాత్ర అనేది అసలు యుద్ధమే కాదన్నట్లు మాట్లాడటం అందరినీ విస్మయపరచింది. అమెరికా యుద్ధోన్మాదానికి బదులు చెప్పడానికంటూ హర్మూజ్ జలసంధిని భౌగోళిక ఆయుధంగా మార్చుకున్న ఇరాన్ అగ్రరాజ్య సైనిక స్థావరాలకు ఆతిథ్యమిస్తున్న ఇరుగుపొరుగు గల్ఫ్ దేశాలను లక్ష్యంగా చేసుకుంటోంది. అదే సమయంలో తాము సౌదీపై యుద్ధం చేయట్లేదని, హూతీలకు వాళ్ల ఆశయాలేవో వాళ్లకు ఉన్నాయని నమ్మబలుకుతోంది. మూడున్నర లక్షలకు పైగా ప్రాణాలను బలితీసుకుని, 45లక్షల మందిని శరణార్థులుగా మార్చిన యెమెన్ అంతర్యుద్ధంలో రియాద్ జోక్యంపై హూతీలు మండిపడుతున్న మాట వాస్తవమే. వాళ్లపై చేసిన దాడుల్లో సౌదీ ఇంతవరకు నెగ్గుకురాలేని సంగతీ నిజమే. కానీ, టెహ్రాన్ దన్నుతోనే బలం పెంచుకున్న హూతీలు అన్ని నిర్ణయాలూ తమకుతామే తీసుకుంటారనుకుంటే పొరపాటే!

ఎర్రసముద్ర తీరంలోని యాన్బు రేవుకు చమురును పైప్‌లైన్‌లో తరలించి, అక్కడి నుంచి బాబ్‌ఎల్ మండేబ్ జలసంధి ద్వారా విదేశాలకు రవాణా చేయడానికి సౌదీ లోగడే ఏర్పాట్లు చేసుకుంది. హర్మూజ్‌లో నౌకల రాకపోకలు స్తంభించిన దరిమిలా కొద్ది నెలలుగా రోజుకు 4050లక్షల బ్యారెళ్ల చమురును సౌదీ ఇలాగే ఇండియాతో పాటు పలు దేశాలకు బట్వాడా చేస్తోంది. దాడుల మూలంగా ప్రస్తుతం ఆ పైప్‌లైన్ మూతపడింది. బాబ్‌ఎల్ మండేబ్‌పై హూతీలు పూర్తిగా పట్టుబిగిస్తే అంతర్జాతీయ సరకు రవాణాకు కీలకమైన మరో సముద్ర మార్గం పరోక్షంగా ఇరాన్ చెప్పుచేతల్లోకి వెళ్లిపోతుంది. మధ్యంతర ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో సౌదీ తరఫున నేరుగా రంగంలోకి దిగి, హూతీలను నిలువరించడానికి ట్రంప్ అంగీకరించట్లేదు. రియాద్‌తో మక్కా రక్షణ ఒప్పందాన్ని కుదుర్చుకున్నప్పటికీ టెహ్రాన్‌తో సమస్యలు ఎదురవుతాయనే భయంతో ఇస్లామాబాద్ సైతం సైనిక జోక్యానికి ఇష్టపడట్లేదు. ఇలా ఎవరికి వారు స్వీయ ప్రయోజనాలే పరమావధిగా పావులు కదుపుతుండటంతో గల్ఫ్ నుంచి చమురు రవాణా సందిగ్ధంలో పడుతోంది. అది ధరల మోతకు దారితీస్తోంది. పరిస్థితులు ఇంకా దిగజారిపోకూడదంటే పరస్పరం కత్తులు దూసుకుంటున్న దేశాలు తక్షణం శాంతి చర్చలకు కూర్చోవాలి. కానీ, అవి అంతటి విజ్ఞత కనబరుస్తాయా అన్నదే ప్రశ్నార్థకం!

# పోలవరం ప్రాజెక్ట్ వద్ద ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలు

**- ఆశీర్వాద దీపం' కార్యక్రమంలో మంత్రి నిమ్మల రామానాయుడు**

**ఏలూరు సెప్టెంబర్ 17, అనంత జనశక్తి న్యూస్**




ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా పోలవరం ప్రాజెక్ట్ వద్ద జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులతో పాటు పోలవరం ప్రాజెక్ట్ వద్ద పనిచేస్తున్న ఇంజనీర్లు, అధికారులు, సిబ్బందితో కలిసి 'ఆశీర్వాద దీపం' కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ.. పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణం రాష్ట్రానికి, దేశానికి అత్యంత కీలకమైనదని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో, ప్రధాని నరేంద్ర మోదీ మరియు కేంద్ర ప్రభుత్వ సహకారంతో పోలవరం ప్రాజెక్ట్ పనులు వేగంగా ముందుకు సాగుతున్నాయని చెప్పారు.గత పాలకుల హయాంలో పోలవరం ప్రాజెక్ట్ పూర్తవుతుందో లేదో అనే ప్రశ్నార్థక పరిస్థితులు నెలకొన్నాయని మంత్రి పేర్కొన్నారు. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో ప్రాజెక్ట్ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ అందిస్తున్న సహకారం, కేంద్ర ప్రభుత్వం కల్పిస్తున్న నిధులు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిరంతర పర్యవేక్షణతో పోలవరం పనుల్లో వేగం పెరిగిందని మంత్రి అన్నారు. 2027 నాటికి పోలవరం ప్రాజెక్ట్‌ను పూర్తి చేసి జాతికి అంకితం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు.ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పోలవరం ప్రాజెక్ట్ వద్ద జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. దేశాభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న ప్రధాని నరేంద్ర మోదీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ప్రధాని నరేంద్ర మోదీ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని పోలవరం ప్రాజెక్ట్ వద్ద నిర్వహించిన 'ఆశీర్వాద దీపం' కార్యక్రమంలో ప్రార్థిస్తున్నామని మంత్రి తెలిపారు. ఆయన నాయకత్వంలో భారతదేశం మరింత శక్తివంతమైన, అభివృద్ధి చెందిన దేశంగా ఎదగాలని ఆకాంక్షించారు.2047 నాటికి 'వికసిత్ భారత్' లక్ష్యాన్ని సాధించాలనే ప్రధాని నరేంద్ర మోదీ ఆలోచనలకు అనుగుణంగా దేశం మరింత అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని మంత్రి నిమ్మల రామానాయుడు ఆకాంక్షించారు.

# నరేంద్ర మోడీ ప్రజాప్రయాణం అద్భుతం అద్వితీయం

**- ప్రజా జీవితంలో 25 ఏళ్లు కొనసాగడం ప్రపంచ స్థాయి రికార్డు**
**- మంగినపూడి సముద్రతీరంలో ఆశీర్వాద్ కా దియా కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర**

**మచిలీపట్నం సెప్టెంబర్ 17 అనంత జనశక్తి న్యూస్**



ఆధునిక భారతదేశ చరిత్రను ప్రపంచ స్థాయిలో నిలిపిన ఘనత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గారిదేనని రాష్ట్ర గనులు భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. మచిలీపట్నం మంగినపూడి సముద్ర తీరంలో ఏర్పాటు చేసిన సాగర తీర మహాగణపతి నవరాత్రి ఉత్సవాల ప్రాంగణంలో "సేవా సంకల్ప్ అభియాన్" కార్యక్రమంలో భాగంగా ఆశీర్వాద్ కా దియా నిర్వహించారు.ఆర్ఎస్ఎస్ ప్రతినిధి మధుకర్ , బీజేపీ జిల్లా అధ్యక్షులు శ్రీరామ్ , ప్రసాద్ , గజేంద్ర , బాలాజీ పలువురు బీజేపీ నాయకులతో కలిసి నరేంద్ర మోడీకి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఆ విఘ్నాధిపతి ఆశీస్సులు ఎల్లప్పుడూ నరేంద్ర మోడీకి ఉండాలనే లక్ష్యంతో ఆ వినాయకుని సమక్షంలో పుట్టినరోజు వేడుకలు నిర్వహించడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. 25 సంవత్సరాల రాజకీయ ప్రస్థానంలో సుమారు 13 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా, 12 సంవత్సరాలు దేశ ప్రధానిగా కొనసాగడం ఒక చరిత్ర. గుజరాత్ ముఖ్యమంత్రిగా పనిచేసి గుజరాత్ రాష్ట్రాన్ని అభివృద్ధిలో దేశానికి ఆదర్శంగా నిలిపారు. ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన రోజు నుంచి ఇండియా నెంబర్ వన్ నినాదంతో పని చేసే ఈరోజు ప్రపంచంలో మూడవ అతిపెద్ద ఆర్థిక శక్తిగా మార్చారు.దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న బాబ్రీ మసీద్.. అయోధ్య రామ మందిర్ ఘటనకు పరిష్కారం చూపారు. ఆర్టికల్ 370 రద్దుచేసి కాశ్మీర్లో శాంతిని నెలకొల్పారు. కరోనా సమయంలో నరేంద్ర మోడీ చూపిన చొరవ అద్వితీయం. ఆ మహా గణపతి ఆశీర్వాదంతో నరేంద్ర మోడీ మరింతకాలం ప్రధానిగా కొనసాగాలని దేశాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.

# కొన్ని విబేధాలు కనిపించినా.. వెంటనే సమిసిపోయాయి



(మొదటి పేజీ తరువాయి)

ఇదే అంశంపై గతంలోనూ లోకేష్ కూటమి మూడు పర్యాయాలు కలిసి పోటీ చేస్తామని పేర్కొన్నారు..

కూటమి పార్టీల అధినేతలుగా తమ మధ్య ఎలాంటి సందేహాలు లేవని మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు.. ఏదైనా విషయంలో తనకు సందేహం వస్తే జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు నేరుగా ఫోన్ చేసి మాట్లాడతానని చెప్పారు. పార్టీల మధ్య చిన్నచిన్న సమస్యలు ఉన్నా కూర్చుని చర్చించుకుని పరిష్కరించుకుంటామని స్పష్టం చేశారు. "నో క్రాస్‌ఫైర్, నో మిస్‌ఫైర్, విడాకులు ఉండవు" అంటూ కూటమి కొనసాగింపుపై తన అభిప్రాయాన్ని లోకేష్ వ్యక్తం చేశారు. కూటమి భాగస్వాముల మధ్య సమన్వయం విషయంలో స్పష్టత ఉందని తెలిపారు.

రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు నడిపించాలంటే కూటమి పార్టీలు మరో మూడు దఫాలు కలిసి పోటీ చేయాల్సిన అవసరం ఉందని లోకేష్ పేర్కొన్నారు. దీనిపై తమకు స్పష్టమైన అవగాహన ఉందని, కూటమి పార్టీల మధ్య కోఆర్డినేషన్ బాగుందని అన్నారు. నెల్లూరులో పార్టీ కార్యకర్తల సమావేశంలోనూ లోకేష్ కూటమి కొనసాగింపుపై మాట్లాడారు. ఇక, 2029 ఎన్నికల్లోనూ కూటమి ప్రభుత్వం కలిసి పోటీ చేస్తుందని స్పష్టం చేశారు.. ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలని, ఎన్నికల్లో గెలిస్తేనే ప్రజలకు మరింత సేవ చేయగలమని సూచించారు.. రాష్ట్రంలో ఏ ఎన్నికలు జరిగినా ఎన్డీఏ జెండా ఎగరాలని, ఎప్పుడు ఎన్నికలు వచ్చినా టీడీపీ నూటికి నూరు శాతం విజయం సాధించేలా కార్యకర్తలు పనిచేయాలని పిలుపునిచ్చారు మంత్రి నారా లోకేష్..

# కాకినాడ జిల్లాలో రోడ్డు ప్రమాదం

**30 మందికి తీవ్ర గాయాలు**

**పెళ్లి వేడుక ముగించుకుని వెళ్తుండగా ఘటన**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 17, అనంత జనశక్తి న్యూస్**

కాకినాడ జిల్లా తుని మండలం రాజుల కొత్తూరు సమీపంలోని జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం తృటిలో తప్పింది. తుని నుంచి ఉప్పాడకు పెళ్లి వేడుక ముగించుకుని సుమారు 30 మంది బంధువులతో వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సును వెనుక నుంచి వేగంగా వచ్చిన ఒక లారీ ఢీకొట్టింది. దీనికి సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.

పెళ్లి బృందం ప్రయాణిస్తున్న బస్సు జాతీయ రహదారిపై వెళ్తుండగా ఈ సంఘటన చోటుచేసుకుంది. లారీ అకస్మాత్తుగా బస్సును ఢీకొనడంతో ఒక్కసారిగా ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. అయితే.. బస్సు డ్రైవర్ అత్యంత అప్రమత్తంగా వ్యవహరించి సమయస్ఫూర్తితో బస్సును అదుపులోకి తీసుకున్నారు. దీనివల్ల బస్సు బోల్తా పడకుండా నివారించబడటంతో, బస్సులో ప్రయాణిస్తున్న ముప్పై మంది పెళ్లి బృందానికి పెను ప్రమాదం తప్పింది.

అయినప్పటికీ, ఈ ఊహించని పరిణామంలో బస్సులో ఉన్న పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే స్థానికులు, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను వెంటనే మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం తుని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో వారికి వైద్యులు తక్షణ చికిత్స అందించారు. 30 మందిలో కొందరికి కేవలం స్వల్ప గాయాలు మాత్రమే కావడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

ఈ ప్రమాదం కారణంగా జాతీయ రహదారిపై కొంతసేపు ట్రాఫిక్ నిలిచిపోయింది. పోలీసులు వెంటనే రంగప్రవేశం చేసి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. దెబ్బతిన్న వాహనాలను రోడ్డుపై నుంచి తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న తుని రూరల్ పోలీసులు లారీ డ్రైవర్ నిర్లక్ష్యంపై దర్యాప్తు ప్రారంభించారు. పెళ్లి వేడుక ఆనందంగా ముగించుకుని తిరిగి వస్తున్న సమయంలో ఈ ప్రమాదం జరగడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. డ్రైవర్ చూపిన తెగువ వల్లే ప్రాణాపాయం తప్పిందని స్థానికులు కొనియాడారు. రాత్రి వేళల్లో జాతీయ రహదారులపై వాహనదారులు మరింత అప్రమత్తంగా ఉండాలని, వేగ నియంత్రణ పాటించాలని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికలపై జనసేన దృష్టి

**- మంత్రి కందుల దుర్గేష్**

**రాజమహేంద్రవరం సెప్టెంబర్ 17**
**అనంత జనశక్తి న్యూస్**



క్షేత్రస్థాయిలో పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేయడం, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి విజయాన్ని ఖాయం చేయడమే లక్ష్యంగా జనసేన పార్టీ సమన్వయ సమావేశం రాజమహేంద్రవరంలోని 'వీ కన్వెన్షన్ హాల్'లో గురువారం వైభవంగా జరిగింది. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా హాజరై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ... రాష్ట్రంలో పంచాయతీలు, కార్పొరేషన్లకు ఎన్నికలు నిర్వహించడం ద్వారానే ఆర్థిక సంఘం నిధులు మంజూరవుతాయని, తద్వారా స్థానిక సంస్థల అభివృద్ధి ముమ్మరమవుతుందనే ఆలోచనతో సీఎం నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తోందని స్పష్టం చేశారు. ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో జనసేన పార్టీ సంస్థాగతంగా ఎంతో బలంగా ఉందన్నారు.

గత కార్పొరేషన్ ఎన్నికల్లో జనసేనకు 23 వేల ఓట్లు దక్కాయని, '

ఓటర్లు స్వచ్ఛందంగా జనసేనకు ఓటు వేశారని, దాన్ని బట్టి పార్టీ బలం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చని చెప్పారు. 2021 ఎన్నికల్లో వైకాపా ఎన్ని ప్రలోభాలు పెట్టినా జనసేన నేతలు వెనక్కి తగ్గలేదని, "మేము జనసేన జెండాను వదిలే ప్రసక్తే లేదు" అని తెగేసి చెప్పడం మన పార్టీ నాయకుల నిజాయితీకి, కట్టుబాటుకు నిదర్శనమని అభినందించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక జనసేన మరింత బలోపేతమైందని, కూటమి ధర్మాన్ని పాటిస్తూనే అన్ని స్థానాల్లో విజయం సాధించేలా పనిచేయాలని పిలుపునిచ్చారు. సీట్ల పంపకాలు, అభ్యర్థుల ఎంపికపై జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, సీఎం చంద్రబాబు నాయుడు సంయుక్తంగా చర్చించి నిర్ణయం తీసుకుంటారని, ఆ నిర్ణయానికి అందరూ కట్టుబడి ఉండాలని సూచించారు.రాజమహేంద్రవరం మేయర్ స్థానంతో పాటు రూరల్, సిటీ పరిధిలోని పలు వార్డుల్లో జనసేన విజయావకాశాలు మెండుగా ఉన్నాయని తెలిపారు.జనసేన పార్టీ సిద్ధాంతాలను నమ్మి ఎవరైనా ముందుకు వస్తే వారిని సాధరంగా పార్టీలోకి ఆహ్వానించి, పార్టీని మరింత బలోపేతం చేయాలని దిశా నిర్దేశం చేశారు. ముందుగా కాకినాడ,

రాజమహేంద్రవరం జనసేన కోఆర్డినేటర్ చినబాబు క్షేత్రస్థాయిలో పార్టీకి పట్టున్న స్థానాలపై రూపొందించిన సమగ్ర నివేదికపై సుదీర్ఘంగా చర్చించారు. ఏది ఏమైనా రాబోయే స్థానిక పోరుకు జనసేన పార్టీ పూర్తి సంసిద్ధంగా ఉండాలని శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో జనసేన నేతలు గంటా స్వరూప, టీవీ రామారావు, రావడ నాగులు,అత్తి సత్య నారాయణ, సపోర్ట్ టీమ్ ప్రతినిధి యడ్ల మహేష్, పెద్ద సంఖ్యలో వీర మహిళలు, జనసైనికులు పాల్గొన్నారు.

# మమ్మల్ని బలవంతం చేయకండి

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 17, అనంత జనశక్తి న్యూస్**




మణిపూర్ రాష్ట్రంలోని సహాయ శిబిరాల్లో చోటుచేసుకుంటున్న అనుమానాస్పద మరణాలు, లైంగిక వేధింపుల ఆరోపణలపై అత్యున్నత న్యాయస్థానం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. శిబిరాల్లో నివాసం ఉంటున్న శరణార్థుల భద్రత, ఆత్మగౌరవంపై తీవ్ర ప్రశ్నలు గుప్పించిన సుప్రీం కోర్టు.. మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. 25 అనుమానాస్పద మరణాలకు సంబంధించిన పోస్టుమార్టం నివేదికలతో పాటు మరణానికి గల కారణాలను వివరిస్తూ సమగ్ర నివేదిక సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది.

**రాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీం తీవ్ర హెచ్చరిక**

ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం 2023 మణిపూర్ జాతి ఘర్షణలకు సంబంధించిన లైంగిక హింస కేసుల విచారణపై దాఖలైన పిటిషన్లను గురువారం విచారించింది. జమ్మూ కశ్మీర్ హైకోర్టు మాజీ చీఫ్ జస్టిస్ గీతా మిత్తల్ కమిటీ సమర్పించిన నివేదికను ఉటంకిస్తూ.. ధర్మాసనం తీవ్రంగా స్పందించింది. జులై 4వ తేదీన కమిటీ అడిగిన సమాచారాన్ని ఇప్పటి వరకు ఎందుకు ఇవ్వలేదని అడ్వకేట్ జనరల్‌ను ప్రశ్నించింది. "ఆదేశాలు జారీ చేసేలా కోర్టును బలవంతం చేయవద్దని మీ చీఫ్ సెక్రటరీకి చెప్పండి. తీసుకున్న చర్యలేమిటో వెంటనే వివరించండి" అని సర్వోన్నత న్యాయస్థానం కఠిన పదజాలంతో హెచ్చరించింది.

**640 మరణాలు.. కేవలం 20 పోస్టుమార్టాలేనా?**

కోర్టు ఆదేశాల్లో నమోదైన వివరాల ప్రకారం.. ఎనిమిది జిల్లాల్లోని సహాయ శిబిరాల్లో ఏకంగా 640 మరణాలు నమోదు అయ్యాయి. క్రిమినల్ కేసులు నమోదు అయినప్పటికీ కేవలం 20 కేసుల్లోనే పోస్టుమార్టం నిర్వహించడంపై ధర్మాసనం ఆశ్చర్యం వ్యక్తం చేసింది. మిగిలిన మరణాలకు పోస్టుమార్టం ఎందుకు చేయలేదని, అలాగే మృతుల కుటుంబాలకు కేవలం రూ. 20,000 నుంచి రూ. 30,000 మాత్రమే పరిహారంగా ఎందుకు ఇచ్చారని నిలదీసింది. అన్ని అనుమానాస్పద మరణాలపై తక్షణమే ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి సరిగ్గా విచారణ జరిగేలా చూడాలని 'మణిపూర్ లీగల్ సర్వీసెస్ అథారిటీ'ని ఆదేశించింది.

ఈ విచారణ సందర్భంగా అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి కోర్టుకు కీలక విషయాలు తెలిపారు. ఎనిమిది జిల్లాల్లో 42 ప్రత్యేక దర్యాప్తు బృందాలను ఏర్పాటు చేశామని వెల్లడించారు. మొత్తం 3,020 కేసులు విచారణలో ఉండగా.. 302 కేసుల్లో చార్జిషీట్లు, 1,583 కేసుల్లో క్లోజర్ రిపోర్టులు దాఖలు చేశామని పేర్కొన్నారు. మరో 1,135 కేసుల్లో విచారణ కొనసాగుతుండగా.. 33 కేసుల్లో ట్రయల్స్ ప్రారంభం అయ్యాయని చెప్పారు. అయితే గ్వాహాటిలోని ప్రత్యేక కోర్టు వారానికి రెండు రోజులు మాత్రమే కేసులను విచారిస్తోందని బాధితుల న్యాయవాది తెలపగా.. విచారణను వేగవంతం చేసేందుకు సీబీఐ కేసుల కోసం మరో రెండు ప్రత్యేక కోర్టులను ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు సూచించింది.

# రామ మందిర తీర్పుతో బాధపడ్డా

**- షారుఖ్, సల్మాన్‌లకు క్షమాపణలు**
**- స్వరా భాస్కర్ మరో వివాదం**
**- తీర్పు తర్వాత తన ముస్లిం స్నేహితులకు మెసేజ్ చేశానని వ్యాఖ్య ఒక హిందువుగా తాను క్షమాపణ చెప్పాలనుకున్న**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 17, అనంత జనశక్తి న్యూస్**

**వివాదాలు, హిందూ వ్యతిరేకతకు కేరాఫ్‌గా ఉన్న బాలీవుడ్ నటి స్వరా భాస్కర్ మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. అయోధ్య రామమందిర నిర్మాణాన్ని వ్యతిరేకిస్తున్నట్లు మాట్లాడిన ఒక వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. 2019లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో తాను బాధపడ్డానని, తీర్పు వెలువడిన తర్వాత తన ముస్లిం స్నేహితులకు మెసేజ్‌లు చేసి క్షమాపణలు చెప్పినట్లు ఆమె వెల్లడించారు.**

**"రామ జన్మభూమి తీర్పు వచ్చినప్పుడు నేను చాలా బాధపడ్డాను. నాకు ఎంత కోపం వచ్చిందంటే, ఇది ఇలాంటి దేశమా అని ఆశ్చర్యపోయా. ఆ నిర్ణయం నాకు అన్యాయం అనిపించింది. నా ఫోన్ లో ఉన్న ప్రతీ ముస్లింకు మెసేజ్ చేశా. సల్మాన్ ఖాన్, షారూఖ్ ఖాశన్, అమీర్ ఖాన్, ఫహద్ అహ్మద్ ఇలా అందరికీ క్షమాపణలు చెప్పాను. ఒక హిందువుగా, నాకు తెలిసిన ముస్లింలందరికీ నేను క్షమాపణలు చెప్పాలనుకున్నా. సుప్రీంకోర్టు తీర్పుతో నేను సిగ్గుపడ్డాను. ఆ తీర్పుతో నేను ఏకీభవించను" అని స్వరా భాస్కర్ చెప్పింది.**

**స్వరా భాస్కర్ వ్యాఖ్యలు ఇంటర్నెట్‌లో వైరల్ అయిన వెంటనే ఆమెపై ట్రోలింగ్ మొదలైంది. చాలా మంది ఆ వ్యక్తికి చరిత్ర తెలియదా.? అని ప్రశ్నించారు. "జై శ్రీరామ్" అంటూ కామెంట్ చేశారు. పాడ్‌కాస్ట్‌లకు స్వరాను ఎందుకు పిలుస్తున్నారని మరికొందరు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫహద్‌తో ఆమె పెళ్లిని కూడా ప్రజలు ట్రోల్ చేశారు. 2019లో, వివాదాస్పదమైన 2.77 ఎకరాల భూమిని రామ మందిర నిర్మాణానికి ఇవ్వాలని సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చింది. ఈ తీర్పును వ్యతిరేకిస్తున్న ఆమెపై కోర్టు ధిక్కరణ చర్యలు చేపట్టాలని మరికొందరు డిమాండ్ చేశారు.**

# పెయింట్ వేసుకునే నువ్వు!

(మొదటి పేజీ తరువాయి)

ఆరు గ్యారంటీలు అమలు అయ్యాయని మభ్యపెట్టే దాంట్లో ఎంత నిజం ఉందో, రేవంత్ రెడ్డి నిన్న మాట్లాడిన మాటల్లో కూడా అంతే నిజముందని ఎద్దేవా చేశారు.

కేసీఆర్ ఇల్లు రెండు ఎకరాల్లో ఉండేది

కేసీఆర్ పుట్టినప్పుడే ఆయన ఇల్లు రెండు ఎకరాల్లో ఉండేది. కేసీఆర్ తండ్రికి వందల ఎకరాల భూమి ఉండేది. చింతమడకలో ఉన్న రెండెకరాల ఇంటిని కూడా ప్రభుత్వ పాఠశాలకు కేసీఆర్ రాసిచ్చారని గుర్తు చేశారు. గోడల మీద పెయింట్ వేసుకునే నీకు జూబ్లీహిల్స్‌లో ప్యాలెస్ ఉండొచ్చు కానీ.. కేసీఆర్‌కు వ్యవసాయం చేసుకోవడానికి భూమి ఉండొద్దా అని ప్రశ్నించారు. కేసీఆర్‌కు మొదటినుండే వందల ఎకరాలు ఉన్నాయి. కేసీఆర్ దొర అంటావా, లేక ఈ మధ్య సంపాదించు కున్నాడు అంటావా? ఏదో ఒకటి ఫిక్స్ అవ్వు రేవంత్ రెడ్డి అని సూచించారు. నేను అమెరికాలో ఆరున్నర సంవత్సరాలు ఉద్యోగం చేసి సంపాదించుకున్నాను. నువ్వు ఏమీ చేసి సంపాదించావు రేవంత్ రెడ్డి? అని నిలదీశారు.

నీకు బుద్ధి, జ్ఞానం ఉందా?

రేవంత్ రెడ్డి 7 ఏండ్లు డిగ్రీ చదివిండు అని ఎద్దేవా చేశారు. కొండల్ రావు అని కూకట్‌పల్లిలో ఒక పెద్దాయన ఉంటే ఆయన ఆస్తులు కూడా మా దాంట్లో రేవంత్ రెడ్డి వేసేశాడు. ఆయనకి మాకు చుట్టరికం కూడా లేదు.. కేవలం వెలమ కులం అంతే. కేసీఆర్ అక్కాచెల్లెలు, అన్నతమ్ముళ్ల సంతానం 300 మంది ఉంటారు. వాళ్ల ఆస్తులు కూడా మా ఖాతాలో కలిపెయ్.సంతోష్ రావుకి మాకు చుట్టరికం ఉంటే ఆయన ఆస్తులు కూడా కేసీఆర్ ఖాతాలో వేస్తావా? నీ అన్నతమ్ముళ్ల వాళ్ల పిల్లల ఆస్తులు నీ ఖాతాలో వేస్తే ఎలా ఉంటుంది? అని నిలదీశారు. నవీన్ రావుకి, కొండల్ రావుకి మాకు ఏం సంబంధం? నీకు బుద్ధి జ్ఞానం ఉందా అని ప్రశ్నించారు.

రాజిరెడ్డిని 14 రోజులు జైలులో పెట్టిండు.

కేటీఆర్‌కు అండగా ఉన్నడని చెప్పి అబ్బాడి అనిల్ రెడ్డికి కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినంక సీఎం రేవంత్ రెడ్డి అరెస్ట్ చేసే ప్రయత్నం చేసిండని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫైర్ అయ్యారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ.. అబ్బాడి అనిల్ రెడ్డి అనే తమ్ముడు మా పార్టీలో పనిచేస్తడు. రెడ్లకులంలో పుట్టిండు.. మా పార్టే నేను కాదంటలేను. కానీ పేదవాడు ఆస్తిపాస్తులు పెద్దగా ఏం లేవు. అయితే ఇదెప్పుడు ఏండ్లుగా వాళ్లు సాగుచేసుకుంటున్న భూమిని రెండెకరాలు ఎప్పటి నుంచో మోఖాలో ఉన్నడని చెప్పి అధికారులు పంచనామా చేసి పట్టా ఇచ్చిర్రు. ఈ పిలగాడు సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉన్నడు.. బీఆర్ఎస్ పార్టీలో తిరుగుతున్నడు కేటీఆర్‌కు అండగా ఉన్నడని చెప్పి ఈయనను కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినంక అరెస్ట్ చేసే ప్రయత్నం చేసిండన్నారు.

అనిల్ రెడ్డి దొరకకపోతే ఈయన బాబాయి అబ్బాడి రాజిరెడ్డి.. ఆయనకు పాపం గుండె జబ్బుంది. ఆ రాజిరెడ్డి పేద కుటుంబం.. 30 గుంటలు పట్టా.. నా మీద కోపంతో ఆయనను తీసుకెళ్లి 14 రోజులు జైలులో పెట్టిండని కేటీఆర్ మండిపడ్డారు. ఎంత దిగజారుడు రాజకీయమంటే బొల్లి రామ్మోహన్ అని మా నాయకుడు ఒకాయన ఉన్నడు.. ఆయనేదో కబ్జా పెట్టిండని ముఖ్యమంత్రి ఆరోపణ చేస్తడు.. ఈ రామ్మోహన్‌కు నేను ఫోన్ చేసిన.. ఏందయ్యా ముఖ్యమంత్రి ఏం మాట్లాడుతున్నడంటే.. ఆయన స్పష్టంగా చెప్పిండు.. 2007లో అప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వముంది.. డాక్యుమెంట్ నంబర్ 7289 2007లో డిసెంబర్ 12న ఈ రామ్మోహన్ అనే వ్యక్తి కొనుగోలు చేసి అప్పుడు రిజిస్టర్ చేసుకున్నడు. మా ప్రభుత్వం వచ్చినంక ఏం జరుగలేదు. 2007లో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన భూమిని ఆక్రమిత భూమి, కబ్జా భూమి అని అంటున్నడు.. ముఖ్యమంత్రికి తెలివితక్కువోడు ఎవడో చెప్పినట్టున్నడన్నారు.

## హెచ్ఎండీఏలో తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం



**హైదరాబాద్,సెప్టెంబర్ 17, అనంత జనశక్తి న్యూస్**

తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం-2026ను హెచ్ఎండీఏ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. అమీర్‌పేట స్వర్ణజయంతి కాంప్లెక్స్‌లోని హెచ్ఎండీఏ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మెట్రోపాలిటన్ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధిలో హెచ్ఎండీఏకు ఉన్న బాధ్యతను వివరించారు. సంస్థ అధికారులు, ఉద్యోగులు తమ విధులను నిబద్ధతతో నిర్వర్తిస్తూ రాష్ట్ర అభివృద్ధి లక్ష్యాల సాధనకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జాయింట్ మెట్రోపాలిటన్ కమిషనర్ (జనరల్), సెక్రటరీ (ఎఫ్ఏసీ) శ్రీనివత్స కోట, ఐఏఎస్, అర్బన్ ఫారెస్ట్రీ డైరెక్టర్ రోహిత్ గోపిడి, ఐఎఫ్ఎస్, చీఫ్ ఇంజనీర్ (ఎఫ్ఏసీ), హెచ్‌జీసీఎల్ సీజీఎం పరమ్ జ్యోతి, ప్లానింగ్ విభాగం డైరెక్టర్లు, ఇతర సీనియర్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## హిందూ ఉత్సవ కేంద్ర సమితికి రూ.3.51 లక్షల విరాళం



**- ధార్మిక, సాంస్కృతిక కార్యక్రమాలకు పట్నం మహేందర్‌రెడ్డి సహకారం**

**తాండూర్ సెప్టెంబర్ 17, అనంత జనశక్తి న్యూస్**

పట్టణంలో హిందూ ఉత్సవ కేంద్ర సమితి ఆధ్వర్యంలో నిర్వహించే ధార్మిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలకు తెలంగాణ శాసన మండలి చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్‌రెడ్డి రూ.3,51,000 విరాళంగా అందజేశారు.హిందూ ధర్మం, సంప్రదాయాలు, సంస్కృతి పరిరక్షణతో పాటు ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణకు తనవంతు సహకారంగా ఈ మొత్తాన్ని చందా రూపంలో అందించినట్లు తెలిపారు.విరాళం మొత్తాన్ని హిందూ ఉత్సవ కేంద్ర సమితి ప్రధాన కార్యదర్శి బిర్కాట్ రఘు, కోశాధికారి అంతారం కిరణ్ ముదిరాజ్, ఉపాధ్యక్షుడు ఆశిష్ అష్టికర్ స్వీకరించారు. ఈ సందర్భంగా సమితి సభ్యులు డాక్టర్ పట్నం మహేందర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

## జీఎంఆర్ ప్రజాపాలనకు ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరికలు



**- బీజేపీ, బీఆర్ఎస్ నుంచి పలువురు నాయకులు, కార్యకర్తల చేరిక**

**దేవరకద్ర సెప్టెంబర్ 17, అనంత జనశక్తి న్యూస్**

దేవరకద్ర నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీలోకి వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తల చేరికలు కొనసాగుతున్నాయి.ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి (జీఎంఆర్) ఆధ్వర్యంలో నియోజకవర్గంలో కొనసాగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై బీజేపీ, బీఆర్ఎస్‌కు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.ఈ సందర్భంగా కాంగ్రెస్‌లో చేరిన నాయకులు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే జీఎంఆర్ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో పాటు నియోజకవర్గంలో చేపడుతున్న పనులను దృష్టిలో ఉంచుకుని కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు పేర్కొన్నారు. ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు, నియోజకవర్గ అభివృద్ధి పనులతో వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ వైపు వస్తున్నారని పార్టీ నాయకులు తెలిపారు. పార్టీలో చేరిన వారికి కాంగ్రెస్ నాయకులు స్వాగతం పలికారు.


## భూ కబ్జా ఆరోపణలు అవాస్తవం: చంద్రశేఖర్ రెడ్డి

నానక్‌రామ్‌గూడలో భూ కబ్జా ఆరోపణలపై చంద్రశేఖర్ రెడ్డి స్పందించారు. తనపై వచ్చిన ఆరోపణలను ఖండిస్తూ వీడియో విడుదల చేశారు. "నానక్‌రామ్‌గూడలో నేను, సునీల్ కలిసి రైతుల దగ్గర చట్టబద్ధంగా 10 ఎకరాలు కొనుగోలు చేశాం. అందులో సునీల్ మూడు ఎకరాలు తీసుకున్నారు. భూమికి సంబంధించిన పత్రాలన్నీ మా వద్ద ఉన్నాయి. మంత్రీ కాస్మోసిస్ భవనం గేట్లు పగులగొట్టారని, సెక్యూరిటీ సిబ్బందిని బెదిరించారన్న ఆరోపణలు అవాస్తవం. అక్రమంగా భూమిలోకి వెళ్లలేదు. మాపై వచ్చిన ఆరోపణలన్నీ పూర్తి అవాస్తవం" అని పేర్కొన్నారు. తనపై కేసు నమోదైన నేపథ్యంలో చంద్రశేఖర్‌రెడ్డి వివరణ ఇచ్చారు.



# దీర్ఘకాలిక వ్యాధుల చికిత్సలో రోగి భద్రత కీలకం





**మెడికవర్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో పేషెంట్ సేఫ్టీ డే అవగాహన కార్యక్రమం**

**హైదరాబాద్, సెప్టెంబర్ 17,అనంత జనశక్తి న్యూస్**

క్యాన్సర్, గుండె జబ్బులు, మధుమేహం వంటి దీర్ఘకాలిక వ్యాధుల చికిత్సలో రోగి భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని మెడికవర్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ వైద్యులు పేర్కొన్నారు.ప్రపంచ పేషెంట్ సేఫ్టీ డే సందర్భంగా సెప్టెంబర్ 17న 'సేఫ్ కేర్ ఫర్ నాన్‌కమ్యూనికబుల్ డిసీజెస్' అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులకు చికిత్స, మందుల వినియోగం, ప్రమాద సూచనలు, ఫాలోఅప్‌పై అవగాహన కల్పించారు. రోగులు వైద్యులను అడగాల్సిన ఐదు ముఖ్యమైన ప్రశ్నలతో రూపొందించిన ' అస్క్ యువర్ డాక్టర్ 5' కార్డును కూడా ప్రారంభించారు. ఈ కార్డులను దీర్ఘకాలిక వ్యాధులతో చికిత్స పొందుతున్న రోగులకు ఆసుపత్రి అవుట్‌పేషెంట్ విభాగాల్లో అందించనున్నారు. మెడికవర్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ సర్జికల్ ఆంకాలజిస్ట్ డా. రవి చందర్ మాట్లాడుతూ, క్యాన్సర్ చికిత్సలో రోగికి తన చికిత్సా విధానం, మందుల మోతాదు, తదుపరి దశలు, ప్రమాద సూచనలపై స్పష్టత ఉండాలని అన్నారు. సందేహాలను వైద్యులను అడగడం కూడా చికిత్సలో భాగమేనని పేర్కొన్నారు. మెడికల్ ఆంకాలజిస్ట్ డా. సారిత మాట్లాడుతూ, రోగులు తాము వినియోగిస్తున్న అన్ని మందుల వివరాలను వైద్యులకు తెలియజేయడం, మందులను సూచించిన విధంగా తీసుకోవడం, పరీక్షలు, ఫాలో అప్‌లను సమయానికి పూర్తి చేయడం అవసరమన్నారు. ఆరోగ్యంలో అసాధారణ మార్పులు కనిపిస్తే ఆలస్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని సూచించారు. రోగి, కుటుంబ సభ్యులు, వైద్య బృందం మధ్య సమర్థవంతమైన సమాచార మార్పిడి చికిత్సను సురక్షితంగా కొనసాగించడంలో కీలకమని వైద్యులు తెలిపారు.

# ధర్మ విజేత సెప్టెంబర్ సంచిక ఆవిష్కరణ



**హైదరాబాద్ సెప్టెంబర్ 17, అనంత జనశక్తి న్యూస్**

తెలంగాణ ప్రెస్ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస రెడ్డి , ఆంధ్రప్రదేశ్ పూర్వ ప్రెస్ అకాడమీ చైర్మన్, సీనియర్ పాత్రికేయులు కె. రామచంద్ర రావు కలిసి "ధర్మ విజేత" మాస పత్రిక సెప్టెంబర్ సంచికను ఘనంగా ఆవిష్కరించారు.సామాజిక చైతన్యం, విద్య, వ్యవసాయం, పర్యావరణం, కళలు, సినిమా, ప్రజా సమస్యలు వంటి విభిన్న అంశాలను ప్రతిబింబిస్తూ రూపొందించిన ఈ సంచికలో అనేక ఆలోచనాత్మక, విశ్లేషణాత్మక వ్యాసాలకు ప్రాధాన్యం కల్పించారు.101 సంవత్సరాల వయస్సులోనూ సామాజిక చైతన్యానికి ప్రతీకగా నిలుస్తున్న శ్రీ చుక్కా రామయ్య, అనంతపురం జిల్లాకు చెందిన "అనంత ఆణిముత్యం" ప్రభాకర్ జీ, ప్రముఖ దర్శకులు శ్రీ బి. నరసింగరావు, స్వాతంత్ర్య సమరంలో తన సర్వస్వాన్ని ధారపోసిన చింతలచెరువు హంపమ్మ వంటి ప్రముఖుల జీవిత విశేషాలు, సేవలు, స్ఫూర్తిదాయక అంశాలను ఈ సంచికలో పరిచయం చేశారు.అలాగే సినిమా సమీక్షలు, సుమవనం స్కూల్, నేల క్షీణత, వరి ఉత్పత్తి పెరుగుదల, పేద మరియు ప్రతిభావంతులైన విద్యార్థులకు అందుతున్న ప్రతిభా స్కాలర్‌షిప్‌లు తదితర అంశాలపై ప్రత్యేక కథనాలు, విశ్లేషణాత్మక వ్యాసాలు ఈ సంచికలో చోటుచేసుకున్నాయి.ఈ సందర్భంగా "ధర్మ విజేత" ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "టి స్పార్క్ టీవీ" ప్రోమోను కూడా అతిథులు ఆవిష్కరించారు. మీడియా రంగంలో నూతన ఆలోచనలకు, సామాజిక అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు టి స్పార్క్ టీవీ వేదికగా కార్యక్రమాలను రూపొందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. "టి స్పార్క్ టీవీ" తెలుగు ప్రాడ్ కాస్ట్ రంగంలో మంచి రూపకాలు ప్రసారం చేయనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు.కార్యక్రమంలో "ధర్మ విజేత" ఎడిటర్ డా. ఉద్దండం చంద్రశేఖర్, గౌరవ సంపాదకులు డా. ముచ్చుకోట సురేష్ బాబు, కరస్పాండెంట్ మరియు టి స్పార్క్ టీవీ సీఈఓ షేక్ బాబా పాల్గొన్నారు.

# రోబోటిక్, ఫ్లోరోసెన్స్ సాంకేతికతతో క్యాన్సర్ శస్త్రచికిత్సల్లో విప్లవాత్మక మార్పులు

**హైదరాబాద్ సెప్టెంబర్ 17, అనంత జనశక్తి న్యూస్**

క్యాన్సర్ శస్త్రచికిత్స రంగంలో రోబోటిక్ మరియు ఫ్లోరోసెన్స్ ఆధారిత ఆధునిక సాంకేతికతలు కీలక మార్పులకు దోహదం చేస్తున్నాయని సీనియర్ సర్జికల్ ఆంకాలజిస్ట్, రోబోటిక్ సర్జన్ డా. రాజేష్ గౌడ్ తెలిపారు. క్యాన్సర్‌ను తొలగించడంతో పాటు రోగి జీవన నాణ్యతను కాపాడటం ఆధునిక శస్త్రచికిత్సల ప్రధాన లక్ష్యంగా మారిందన్నారు.

రోబోటిక్ శస్త్రచికిత్సలో అధిక స్పష్టత కలిగిన త్రిమితీయ దృశ్య వ్యవస్థ, సూక్ష్మ కదలికలను నియంత్రించే పరికరాలు, మానవ మణికట్టు కదలికలను అనుకరించే ప్రత్యేక పరికరాల సహాయంతో క్లిష్టమైన శస్త్రచికిత్సలను ఖచ్చితత్వంతో నిర్వహించవచ్చని వివరించారు. పెద్ద కోతలకు బదులుగా సుమారు 8 మిల్లీమీటర్ల చిన్న రంధ్రాల ద్వారా శస్త్రచికిత్స చేయడం వల్ల నొప్పి, రక్తనష్టం, మచ్చలు తగ్గి, త్వరగా కోలుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.





**మహిళల క్యాన్సర్లలో రోబోటిక్ శస్త్రచికిత్స**

గర్భాశయ, అండాశయ క్యాన్సర్లలో రోబోటిక్ శస్త్రచికిత్స ద్వారా క్లిష్టమైన గర్భాశయ తొలగింపు, శోషరస గ్రంథుల తొలగింపు వంటి ప్రక్రియలను నిర్వహించవచ్చన్నారు. చాలామంది రోగులు తక్కువ వ్యవధిలోనే ఆసుపత్రి నుంచి ఇంటికి వెళ్లే అవకాశం ఉంటుందని తెలిపారు.

**రొమ్ము క్యాన్సర్‌లో ఫ్లోరోసెన్స్ మార్గదర్శక శస్త్రచికిత్స**

రొమ్ము క్యాన్సర్‌లో ప్రత్యేక రంగు ద్రావణం సహాయంతో క్యాన్సర్ వ్యాధి మొదటగా చేరే సెంటినెల్ శోషరస గ్రంథులను ప్రత్యేక కెమెరాతో గుర్తించవచ్చన్నారు. అవసరమైన గ్రంథులను మాత్రమే తొలగించడం ద్వారా చేతి వాపు, నొప్పి వంటి సమస్యలను తగ్గించేందుకు ఈ విధానం దోహదపడుతుందని వివరించారు.

**యూరాలజీ, పెద్దపేగు క్యాన్సర్లలోనూ ఆధునిక విధానాలు**

**ప్రోస్టేట్, మూత్రాశయం, మూత్రపిండాలు, అడ్రినల్ గ్రంథి క్యాన్సర్లలో రోబోటిక్ శస్త్రచికిత్సతో సూక్ష్మంగా పనిచేసే అవకాశం పెరిగిందన్నారు.మూత్రపిండ క్యాన్సర్‌లో ట్యూమర్ ఉన్న భాగాన్ని మాత్రమే తొలగించి మిగిలిన ఆరోగ్యకరమైన మూత్రపిండాన్ని కాపాడే పాక్షిక మూత్రపిండ శస్త్రచికిత్సకు ఇది ఉపయోగపడుతుందని తెలిపారు. పెద్దపేగు, మలద్వార క్యాన్సర్లలో ట్యూమర్‌ను ఖచ్చితంగా తొలగించడంతో పాటు అవసరమైన సందర్భాల్లో శాశ్వత కృత్రిమ మలద్వారం ఏర్పాటు చేయాల్సిన పరిస్థితిని తగ్గించేందుకు ఆధునిక శస్త్రచికిత్సలు దోహదపడుతున్నాయని చెప్పారు. పేగులను కలిపే ప్రక్రియలో ఆధునిక పరికరాల వినియోగం కూడా భద్రతను పెంచుతుందని వివరించారు.**

**ఛాతి శస్త్రచికిత్సల్లోనూ చిన్న కోతల విధానం**

గతంలో ఊపిరితిత్తుల శస్త్రచికిత్సలకు పెద్ద కోతలు అవసరమయ్యేవని, ప్రస్తుతం చిన్న రంధ్రాల ద్వారా రోబోటిక్ విధానంలో అనేక శస్త్రచికిత్సలు నిర్వహించే అవకాశం ఉందన్నారు. దీనివల్ల ఆసుపత్రిలో ఉండే సమయం, నొప్పి, కోలుకునే సమయం తగ్గే అవకాశం ఉంటుందని తెలిపారు.

**క్యాన్సర్ కణజాలాన్ని వెలుగులో గుర్తించే ఫైర్‌ఫ్లై సాంకేతికత**

ఫైర్‌ఫ్లై ఫ్లోరోసెన్స్ చిత్రీకరణ విధానంలో ప్రత్యేక రంగు ద్రావణం సహాయంతో కొన్ని కణజాలాలు, శోషరస మార్గాలను మరింత స్పష్టంగా గుర్తించవచ్చన్నారు. దీంతో శోషరస గ్రంథుల గుర్తింపు, తొలగింపు ప్రక్రియల్లో ఖచ్చితత్వం పెరిగే అవకాశం ఉంటుందని తెలిపారు.రోబోటిక్, ఫ్లోరోసెన్స్ మార్గదర్శక శస్త్రచికిత్సల వల్ల తక్కువ నొప్పి, తక్కువ రక్తనష్టం, తక్కువ ఆసుపత్రి బస, చిన్న మచ్చలు, త్వరగా సాధారణ జీవితానికి చేరుకునే అవకాశం వంటి ప్రయోజనాలు ఉండవచ్చని డా. రాజేష్ గౌడ్ పేర్కొన్నారు."క్యాన్సర్‌ను నయం చేయడమే కాదు.. రోగి జీవితాన్ని మరింత మెరుగ్గా మార్చడం కూడా ఆధునిక శస్త్రచికిత్సల లక్ష్యం" అని ఆయన అన్నారు.డా. రాజేష్ గౌడ్
సీనియర్ సర్జికల్ ఆంకాలజిస్ట్, రోబోటిక్ సర్జన్
యశోద ఆసుపత్రులు, హైటెక్ సిటీ, హైదరాబాద్.

# ప్రజా సంక్షేమం-అభివృద్ధికి సమన్వయ ప్రాధాన్యత





**- ఖమ్మం పరేడ్ గ్రౌండ్‌లో జాతీయ జెండా ఆవిష్కరించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క**

**ఖమ్మం, సెప్టెంబర్ 17 (అనంత జనశక్తి న్యూస్):**

ప్రజా పాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఖమ్మం పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు జాతీయ జెండాను ఆవిష్కరించి రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా 1948 సెప్టెంబర్ 17న తెలంగాణ భారతదేశంలో అంతర్భాగంగా మారి ప్రజాస్వామ్య ప్రజా పాలనలోకి ప్రవేశించిన చారిత్రక ఘట్టాన్ని స్మరించుకున్నారు.స్వేచ్ఛ కోసం పోరాడిన యోధుల త్యాగాలకు నివాళులర్పించిన ఉప ముఖ్యమంత్రి, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రజా ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు.ఖమ్మం జిల్లాలో మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం ద్వారా రూ.343.44 కోట్ల మేర ఆదా జరిగిందని తెలిపారు. గృహజ్యోతి పథకం ద్వారా 2.49 లక్షల కుటుంబాలకు ఉచిత విద్యుత్ అందుతున్నట్లు పేర్కొన్నారు. 3.41 లక్షల మంది రైతులకు రూ.427.96 కోట్ల రైతు భరోసా, 1.31 లక్షల మంది రైతులకు రూ.912.61 కోట్ల రుణమాఫీ చేసినట్లు వెల్లడించారు.తొలి దశలో 16,597 ఇందిరమ్మ ఇళ్లకు మంజూరు ఇచ్చినట్లు తెలిపారు. విద్య, వైద్యం, సాగునీరు, రహదారులు, తాగునీరు, ఉపాధి రంగాల్లో విస్తృతంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని చెప్పారు. మహిళా స్వయం సహాయక సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయడంతో పాటు యువతకు నైపుణ్య శిక్షణ, ఉద్యోగాలు, స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు వివరించారు.సంక్షేమం, అభివృద్ధిని సమన్వయం చేస్తూ ప్రతి కుటుంబ సంక్షేమమే లక్ష్యంగా ప్రజా పాలన కొనసాగుతుందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

# ఫ్యూచర్ సిటీ అభివృద్ధిని సబితమ్మ ఎందుకు అడ్డుకుంటుందో చెప్పాలి

- ఫ్యూచర్ సిటీలో మహేశ్వరం మండలంలోని అన్ని గ్రామాలను విలీనం చేయాలి
- బీరప్పగుడి నుంచి ఫ్యూచర్ సిటీ వరకు కాంగ్రెస్ శ్రేణులు, ప్రజల భారీ ర్యాలీ
- ఎఫ్‌సిడిఏ కమిషనర్ శశాంకకు వినతిపత్రం సమర్పణ
- జేఏసీ చైర్మన్ ఒత్తుల రఘుపతి ఆరోపణలు
- మహేశ్వరం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వట్టెలా మల్లేష్ యాదవ్
- అన్నిగ్రామాల విలీనానికి కృషి చేస్తానన్న కాంగ్రెస్ ఇన్‌చార్జ్ కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి



**మహేశ్వరం, సెప్టెంబర్ 17, అనంత జనశక్తి న్యూస్**

ఫ్యూచర్ సిటీలో మహేశ్వరం మండలంలోని అన్ని గ్రామాలను విలీనం చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం భారీ ర్యాలీ నిర్వహించారు. మహేశ్వరం మండలంలోని వివిధ గ్రామాల నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ర్యాలీలో పాల్గొన్నారు. బీరప్పగుడి నుంచి ప్రారంభమైన ర్యాలీ అంబేద్కర్ చౌరస్తా వరకు కొనసాగింది. అనంతరం అక్కడి నుంచి ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎఫ్‌సీడీఏ) కార్యాలయానికి చేరుకున్న నాయకులు, ప్రజలు కమిషనర్ శశాంకను కలిసి వినతిపత్రం సమర్పించారు. మహేశ్వరం మండలంలోని అన్ని గ్రామాలను ఫ్యూచర్ సిటీ పరిధిలోకి తీసుకురావాలని, ఈ ప్రాంత అభివృద్ధికి సంబంధించి ప్రజల ఆకాంక్షలను పరిగణనలోకి తీసుకోవాలని అధికారులను కోరారు.

**మహేశ్వరం మండల గ్రామాల విలీనానికి డిమాండ్**

ఫ్యూచర్ సిటీ అభివృద్ధి నేపథ్యంలో మహేశ్వరం మండలంలోని గ్రామాలను అందులో విలీనం చేయాలనే డిమాండ్‌తో ఈ ర్యాలీ నిర్వహించారు. ఫ్యూచర్ సిటీ పరిధిలోకి తమ గ్రామాలను తీసుకురావడం ద్వారా అభివృద్ధి కార్యక్రమాలు, మౌలిక వసతులు, ఉపాధి అవకాశాలు, విద్య, వైద్యం, రవాణా సౌకర్యాలు మెరుగుపడే అవకాశం ఉంటుందని నాయకులు, ప్రజలు పేర్కొన్నారు. ఇప్పటికే ఫ్యూచర్ సిటీ అభివృద్ధిపై చర్చలు జరుగుతున్న నేపథ్యంలో మహేశ్వరం మండలంలోని అన్ని గ్రామాలను ఒకే అభివృద్ధి పరిధిలోకి తీసుకురావాలని కోరారు. మహేశ్వరం మండలం హైదరాబాద్ నగరానికి సమీపంలో ఉండటంతో పాటు, భవిష్యత్తులో అభివృద్ధి చెందే ప్రాంతంగా గుర్తింపు పొందుతోందని నాయకులు తెలిపారు. ఫ్యూచర్ సిటీలో అభివృద్ధి కార్యక్రమాలు ముందుకు సాగితే ఈ ప్రాంత ప్రజలకు ప్రయోజనం కలిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. గ్రామాల విలీనంతో అభివృద్ధి కార్యక్రమాలను సమగ్రంగా చేపట్టేందుకు అవకాశం ఉంటుందని, గ్రామీణ ప్రాంతాల్లో కూడా మౌలిక వసతులు మెరుగుపడతాయని వివరించారు.

**ఫ్యూచర్ సిటీని అడ్డుకుంటున్నారంటూ ఆరోపణలు**

ఫ్యూచర్ సిటీ జేఏసీ చైర్మన్ వత్తుల రఘుపతి మాట్లాడుతూ ఫ్యూచర్ సిటీ అభివృద్ధిని అడ్డుకుంటున్నారంటూ స్థానిక ఎమ్మెల్యే సబిత ఇంద్రారెడ్డి, బీఆర్ఎస్ నాయకులపై ఆరోపణలు చేశారు. ఫ్యూచర్ సిటీ వల్ల మహేశ్వరం ప్రాంతానికి కలిగే ప్రయోజనాలను ఆయన వివరించారు. అభివృద్ధి ప్రాజెక్టుల ద్వారా ఈ ప్రాంతంలో మౌలిక వసతులు మెరుగుపడే అవకాశం ఉందని, యువతకు ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశం ఉందని తెలిపారు. ఫ్యూచర్ సిటీ ఏర్పాటుతో మహేశ్వరం ప్రాంతంలో రహదారులు, రవాణా సౌకర్యాలు, విద్య, వైద్యం, పరిశ్రమలు, ఉపాధి రంగాల్లో అభివృద్ధి జరిగే అవకాశం ఉందని రఘుపతి పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రాంత ప్రజలకు కలిగే ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నాయకులు, ప్రజలు అభివృద్ధికి సహకరించాల్సిన అవసరం ఉందన్నారు. అభివృద్ధి కార్యక్రమాలపై రాజకీయ ఆరోపణలు కాకుండా ప్రజల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని చర్చ జరగాలని ఆయన కోరారు. ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి సంబంధించి స్థానికంగా నెలకొన్న పరిస్థితులను కూడా ఆయన ప్రస్తావించారు. అభివృద్ధి ప్రాజెక్టులకు ఆటంకాలు కల్పించడం వల్ల ప్రజలకు నష్టం కలిగే అవకాశం ఉందని తెలిపారు. మహేశ్వరం మండలంలోని గ్రామాల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి సహకరించాలని పిలుపునిచ్చారు. స్థానిక ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఒకప్పుడు ఫార్మాసిటీ ని రద్దు చేయాలని డిమాండ్ చేసిన ఆమె ఇప్పుడు అదే ఫార్మాసిటీ రావాలి , ఫ్యూచర్ సిటీ పోవాలని ప్రజలను మభ్య పెడుతున్నారని, ఆమె గత 20 సంవత్సరాలుగా ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ మహేశ్వరం ప్రాంతన్ని హైదరాబాద్ కి దగ్గరగా ఉన్న అభివృద్ధికి మాత్రం ఆమడ దూరంలో ఉందని జేఏసీ చైర్మన్ రఘుపతి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. వాళ్ళకి చిత్త శుద్ధి ఉంటే ఫ్యూచర్ సిటీ అభివృద్ధి సహకరించాలని అన్నారు.

**స్థానిక సర్పంచ్‌లపై కూడా ఆరోపణలు**

ఫ్యూచర్ సిటీని అడ్డుకుంటున్నారంటూ కొందరు స్థానిక సర్పంచ్‌లపై కూడా వివిధ రాజకీయ నాయకులు, ప్రజ సంఘాల నాయకులు కూడా ఆరోపణలు చేశారు. గ్రామాల అభివృద్ధికి సంబంధించిన అంశాల్లో ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని, అభివృద్ధి అవకాశాలను దూరం చేయకుండా చూడాలని కోరారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, రహదారుల అభివృద్ధి, విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు వంటి అంశాలు ప్రజలకు ఎంతో ముఖ్యమైనవని పేర్కొన్నారు. ఫ్యూచర్ సిటీ అభివృద్ధి ద్వారా మహేశ్వరం మండలంలోని గ్రామాలకు కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామాల అభివృద్ధి విషయంలో రాజకీయ భేదాభిప్రాయాలు ఉన్నప్పటికీ, ప్రజల ప్రయోజనాలకు సంబంధించిన అంశాలను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ఫ్యూచర్ సిటీ పరిధిలోకి గ్రామాలను విలీనం చేయడం వల్ల కలిగే ప్రయోజనాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని కోరారు.

**అన్నిగ్రామాల విలీనానికి కృషి చేస్తా: కేఎల్ఆర్**

మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి ఇటీవల తుక్కుగూడాలో ఏర్పాటు చేసిన నిరసన కార్యక్రమంలో మహేశ్వరం మండలంలోని అన్ని గ్రామాలను ఫ్యూచర్ సిటీలో విలీనం చేయడానికి కృషి చేస్తానని తెలిపారు. మహేశ్వరం మండలంలోని ప్రతి గ్రామం అభివృద్ధి చెందాలన్నదే తన లక్ష్యమని పేర్కొన్నారు. ఫ్యూచర్ సిటీ అభివృద్ధి కార్యక్రమాల్లో మహేశ్వరం మండలంలోని అన్ని గ్రామాలకు అవకాశం కల్పించేలా సంబంధిత అధికారులతో చర్చలు జరిపి మహేశ్వరం మండలంలోని గ్రామాల అభివృద్ధికి అవసరమైన రహదారులు, తాగునీరు, డ్రైనేజీ, విద్యుత్, విద్య, వైద్యం, రవాణా వంటి మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని తెలిపారు. ఈ నేపథ్యంలోనే గురువారం భారీ ర్యాలీ నిర్వహించి కమిషనర్ శశాంకకు వినతిపత్రం అందజేసినట్లు వివరించారు.

**బీరప్పగుడి నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు భారీ ర్యాలీ**

ఫ్యూచర్ సిటీ అభివృద్ధి, మహేశ్వరం మండలంలోని గ్రామాల విలీనానికి మద్దతుగా నిర్వహించిన ర్యాలీ బీరప్పగుడి నుంచి ప్రారంభమైంది. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున ర్యాలీలో పాల్గొన్నారు. ర్యాలీ అంబేద్కర్ చౌరస్తా వరకు కొనసాగింది. అనంతరం నాయకులు, ప్రజలు అక్కడి నుంచి ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యాలయానికి చేరుకున్నారు. ర్యాలీలో మహేశ్వరం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు పాల్గొని తమ డిమాండ్లను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఫ్యూచర్ సిటీ పరిధిలోకి అన్ని గ్రామాలను విలీనం చేయాలని, అభివృద్ధి కార్యక్రమాల్లో గ్రామాలకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి సంబంధించిన అంశాలను ప్రజలకు వివరించారు.

**కమిషనర్ శశాంకకు వినతిపత్రం**

ఎఫ్‌సీడీఏ కమిషనర్ శశాంకను కలిసి వినతిపత్రం సమర్పించిన కాంగ్రెస్ నాయకులు, ప్రజలు మహేశ్వరం మండలంలోని అన్ని గ్రామాలను ఫ్యూచర్ సిటీలో విలీనం చేయాలని కోరారు.

**ప్రజల కోరికను అధికారుల దృష్టికి తీసుకెళ్లిన నాయకులు**

ఫ్యూచర్ సిటీ అభివృద్ధి నేపథ్యంలో మహేశ్వరం మండలంలోని గ్రామాల విలీనానికి సంబంధించిన డిమాండ్‌ను అధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడమే ఈ ర్యాలీ ప్రధాన ఉద్దేశంగా నాయకులు తెలిపారు. వివిధ గ్రామాల నుంచి ప్రజలు భారీగా తరలివచ్చి తమ మద్దతు ప్రకటించారు. ప్రజల సమస్యలు, గ్రామాల అభివృద్ధికి సంబంధించిన అంశాలను వినతిపత్రం ద్వారా కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. మహేశ్వరం మండలంలోని అన్ని గ్రామాలకు సమగ్ర అభివృద్ధి అవకాశాలు కల్పించాలని, ఫ్యూచర్ సిటీ అభివృద్ధి కార్యక్రమాల్లో స్థానిక గ్రామాలకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. రాబోయే రోజుల్లో కూడా గ్రామాల విలీనం, ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి సంబంధించిన అంశాలపై ప్రజలతో కలిసి కార్యక్రమాలు నిర్వహిస్తామని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వట్టేలా మల్లేష్ యాదవ్, జేఏసీ ముఖ్య నాయకులు కర్నాటి మనోహర్, జగన్ రెడ్డి, ఐఎన్టీయూసి నియోజకవర్గ అధ్యక్షుడు నడికూడ శివ, శివగంగా దేవాలయ చైర్మన్ అల్లే కుమార్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చాకలి యాదయ్య, వివిధ గ్రామాలకు చెందిన సర్పంచ్ లు దేవేందర్ నాయక్, గోపాల్ నాయక్, యాదగిరి గౌడ్, రాఘవేందర్ రెడ్డి, కూన యాదయ్య, రాజు గొల్లురి, చెపంగి ప్రవీణ్, కార్యకర్తలు, ఫ్యూచర్ సిటీ జేఏసీ నాయకులు, వివిధ గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# గణేష్ నిమజ్జనానికి పటిష్ట భద్రతా ఏర్పాట్లు

- నిర్దేశిత మార్గాల్లోనే శోభాయాత్ర.. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు
- ప్రజలు, ఉత్సవ కమిటీలు పోలీసులకు సహకరించాలి: ఎస్పీ జగదీష్

**అనంతపురం, సెప్టెంబర్ 17:అనంత జనశక్తి న్యూస్**

అనంతపురం నగరంలో శుక్రవారం (18వ తేదీ) నిర్వహించనున్న గణేష్ విగ్రహాల నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా జరిగేలా పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ పి. జగదీష్ తెలిపారు. ప్రజలు, ఉత్సవ కమిటీలు, ముఖ్యంగా యువత పోలీసులకు సహకరించి ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా శోభాయాత్ర, నిమజ్జనం కార్యక్రమాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు.నిమజ్జన కార్యక్రమంలో భాగంగా పోలీసు సిబ్బందితో పాటు అత్యాధునిక సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాలతో నిరంతరం నిఘా ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు. విగ్రహాల నిమజ్జన ప్రక్రియ క్రమపద్ధతిలో, సకాలంలో పూర్తయ్యేలా ఉత్సవ కమిటీలు తమ తరఫున స్వచ్ఛంద సేవకులను నిమజ్జన ప్రాంతాల్లో ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.శోభాయాత్ర ప్రారంభం నుంచే నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ఇతరులకు ఇబ్బంది కలగకుండా పోలీసులు సూచించిన మార్గాల్లోనే ఊరేగింపు కొనసాగించాలని స్పష్టం చేశారు. బాణసంచా కాల్చరాదని, అధిక శబ్దం కలిగించే డీజేలను ఉపయోగించరాదని హెచ్చరించారు. మద్యం సేవించి వేడుకల్లో పాల్గొనవద్దని సూచించారు.అసాంఘిక శక్తులు, అల్లరిమూకలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు. ఇతరుల మనోభావాలను దెబ్బతీసేలా, మతసామరస్యానికి విఘాతం కలిగించేలా ఎవరైనా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సామాజిక మాధ్యమాల్లో తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేసినా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.మహిళలు, చిన్నారులు, వృద్ధులు అధిక సంఖ్యలో పాల్గొనే ప్రాంతాల్లో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసు సిబ్బందికి ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. నిమజ్జన ప్రాంతాల్లో పోలీసులతో పాటు ఈతగాళ్లు, రెవెన్యూ, మున్సిపల్, అగ్నిమాపక సిబ్బందిని అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు.

**శోభాయాత్రకు నిర్దేశించిన మార్గాలు**

మొదటి మార్గం: తాడిపత్రి బస్‌స్టాండ్-బసవన్నకట్ట-సూర్యనగర్ సర్కిల్-సప్తగిరి సర్కిల్ మీదుగా శోభాయాత్ర కొనసాగుతుంది. జేఎన్‌టీయూ, కలెక్టరేట్ వైపు నుంచి వచ్చే విగ్రహాలు సంఘమేష్ సర్కిల్ మీదుగా సూర్యనగర్ సర్కిల్ వద్ద మొదటి మార్గంలో కలుస్తాయి. హౌసింగ్ బోర్డు, విద్యుత్‌నగర్ సర్కిల్, నాయక్‌నగర్, ఆదర్శనగర్ ప్రాంతాల నుంచి వచ్చే విగ్రహాలు అశోక్‌నగర్, సాయినగర్ మీదుగా సప్తగిరి సర్కిల్ వద్ద చేరుతాయి.రెండో మార్గం: మొదటి రోడ్డు నుంచి ఆరవ రోడ్డు వరకు, రామచంద్రనగర్ వైపు నుంచి వచ్చే విగ్రహాలు సైఫుల్లా పైవంతెన మీదుగా శ్రీకంఠం సర్కిల్‌కు చేరుకుని, అక్కడి నుంచి ఎన్టీఆర్ సర్కిల్, టవర్ క్లాక్, పీటీసీ పైవంతెన మీదుగా నడిమివంకకు చేరుకుంటాయి.మూడో మార్గం: రుద్రంపేట, రామ్‌నగర్, లక్ష్మీనగర్, శ్రీనగర్ కాలనీల నుంచి వచ్చే విగ్రహాలు రామ్‌నగర్ పైవంతెన మీదుగా ప్రభుత్వ ఆసుపత్రి సర్కిల్, తెలుగుతల్లి సర్కిల్, అంబేద్కర్ సర్కిల్ మీదుగా సప్తగిరి సర్కిల్ వద్ద కలుస్తాయి.

**మూడు ప్రాంతాల్లో నిమజ్జన ఏర్పాట్లు**

1. పంపనూరు హెచ్ఎన్ఎస్ఎస్ కాలువ: నాలుగు అడుగుల కంటే ఎక్కువ ఎత్తు ఉన్న విగ్రహాలు.
2. రాచానపల్లి అక్కమ్మగార్ల గుడి సమీపంలోని చెక్‌డ్యామ్: నాలుగు అడుగుల లోపు విగ్రహాలు.
3. రాచానపల్లి కొత్త పైవంతెన సమీపం: నాలుగు అడుగుల లోపు విగ్రహాలు.

**నగరంలో 24 గంటల పాటు ట్రాఫిక్ మళ్లింపు**

గణేష్ నిమజ్జనం సందర్భంగా సెప్టెంబర్ 18 ఉదయం 6 గంటల నుంచి సెప్టెంబర్ 19 ఉదయం 6 గంటల వరకు అనంతపురం నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు, మళ్లింపులు అమల్లో ఉంటాయని పోలీసులు తెలిపారు.గుత్తి వైపు నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలు మిర్చి యార్డు మీదుగా ఆర్టీసీ బస్టాండ్



వైపు వెళ్లాలి.తాడిపత్రి వైపు నుంచి వచ్చే వాహనాలు ఎన్టీఆర్ మార్గం మీదుగా వెళ్లాలి.కళ్యాణదుర్గం, బళ్లారి, రుద్రంపేట వైపు నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలు తపోవనం మీదుగా తాడికలేరు, గుత్తి రోడ్డు, మిర్చి యార్డు మార్గంలో వెళ్లాలని పోలీసులు సూచించారు.వాహనదారులు ట్రాఫిక్ మళ్లింపులను గమనించి పోలీసులకు సహకరించాలని ఎస్పీ పి. జగదీష్ విజ్ఞప్తి చేశారు.

# రావిరాలలో ఘనంగా తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలు



- దేశభక్తితో హోరెత్తిన రావిరాల గ్రామం
- సర్దార్ పటేల్ సంఘం అధ్యక్షుడు, యువ నాయకుడు పులియోజు వెంకటాచారి

**మహేశ్వరం , సెప్టెంబర్ 17, అనంత జనశక్తి న్యూస్**

తెలంగాణ చరిత్రలో మరపురాని రోజైన తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకొని రావిరాల గ్రామంలో వేడుకలు అత్యంత వైభవంగా, దేశభక్తి శోభితంగా జరిగాయి. సర్దార్ పటేల్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలకు సంఘం అధ్యక్షుడు, యువ నాయకుడు పులియోజు వెంకటాచారి అధ్యక్షత వహించారు. ముందుగా పులియోజు వెంకటాచారి జాతీయ పతాకాన్ని ఘనంగా ఆవిష్కరించి, జాతీయ గీతాలాపనతో వేడుకలను ప్రారంభించారు. అనంతరం ఉక్కు మనిషి సర్దార్ వల్లభభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు .ఈ సందర్భంగా పులియోజు వెంకటాచారి మాట్లాడుతూ"1948 సెప్టెంబర్ 17న నిజాం రజాకార్ల నిరంకుశ, నియంత పాలన నుండి తెలంగాణ ప్రజలకు విముక్తి లభించింది. సర్దార్ వల్లభభాయ్ పటేల్ చొరవతో, భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ పోలో ద్వారా హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్ లో విలీనం అయ్యింది. ఎంతో మంది అమరవీరుల త్యాగ ఫలితమే నేడు మనం అనుభవిస్తున్న స్వేచ్ఛ, స్వాతంత్ర్యం. వారి త్యాగాలను స్మరించుకోవడం, యువతలో జాతీయ భావాన్ని, దేశభక్తిని నింపడం మనందరి బాధ్యత. దేశ సమగ్రతను, ఐక్యతను కాపాడుకోవడం ప్రతి పౌరుడి కర్తవ్యం" అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు ఎరుకల శివకుమార్, బోద యాదగిరి రెడ్డి, రాగనమోని మహిందర్, బీజేపీ జిల్లా నాయకులు తలారి శ్రీనివాస్, లింగం నరసింహ తో పాటు సంఘం సభ్యులు,బీజేపీ నాయకులు, కార్యకర్తలు, వివిధ యువజన సంఘాల సభ్యులు, గ్రామ పెద్దలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# అంగరంగ వైభవంగా మంత్రి కందుల దుర్గేష్ జన్మదిన వేడుకలు





- ప్రధాని నరేంద్ర మోదీ, మంత్రి దుర్గేష్ బర్త్‌డే వేడుకలతో నిడదవోలులో పండగ వాతావరణం
- *విజ్జేశ్వరం నుంచి నిడదవోలు వరకు అభిమానుల భారీ బైక్ ర్యాలీ, గజమాలతో మంత్రి దుర్గేష్ కు ఘన స్వాగతం
- స్వర్ణాంధ్ర, వికసిత్ భారత్ 2047 లక్ష్య సాధనకు కృషి చేస్తాం: మంత్రి కందుల దుర్గేష్

**నిడదవోలు సెప్టెంబర్ 17, అనంత జనశక్తి న్యూస్**

రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ జన్మదిన వేడుకలు నిడదవోలు పట్టణంలోని లయన్స్ క్లబ్‌లో అభిమానులు, కార్యకర్తల భారీ జనసందోహం నడుమ అంగరంగ వైభవంగా జరిగాయి. సర్వమత ప్రార్థనలతో ప్రారంభమైన ఈ వేడుకల్లో నియోజకవర్గ నలుమూలల నుంచి విచ్చేసిన అభిమానుల కోలాహలంతో పండగ వాతావరణం నెలకొంది.ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ కేక్ కట్ చేసి అభిమానులకు పంచారు. ఇదే రోజు దేశ ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం కూడా కావడంతో ప్రధానికి ప్రత్యేక జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ మరొక కేక్‌ను కట్ చేశారు.

**ప్రధాని ఆయురారోగ్యాలతో ఉండాలి**

వేడుకల్లో భాగంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ... "దేశాన్ని అభివృద్ధి పథంలో ముందంజలో నిలుపుతున్న ఉక్కు మనిషి, ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి 'ఆయుష్మాన్ భవ' అని ప్రతి ఒక్కరూ ఆశీస్సులు అందజేయాలి. ఆయన నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, మరో 25 ఏళ్ల పాటు దేశాన్ని ఆయనే పరిపాలించాలని కోరుకుంటున్నాను.ప్రధాని మోదీ 25 ఏళ్ల ప్రజా జీవితాన్ని (ముఖ్యమంత్రిగా, ప్రధానిగా) పురస్కరించుకుని సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 17 వరకు నెల రోజుల పాటు జరిగే సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమం జరుగుతోంది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం రక్తదాన శిబిరాలు, వైద్య శిబిరాలు, పరిశుభ్రత కార్యక్రమాలు, మొక్కలు నాటే కార్యక్రమాలు తదితర పలు సేవా కార్యక్రమాలను చేపట్టనుంది" అని తెలిపారు.. ప్రజానీకం అందరూ ఈ కార్యక్రమంలో భాగస్వామ్యులు అవ్వాలని పిలుపునిచ్చారు.

**స్వర్ణాంధ్ర 2047 లక్ష్య సాధనే ధ్యేయం**

దేశ ప్రధాని ఆకాంక్షించిన 'వికసిత్ భారత్ 2047', ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆకాంక్షించిన 'స్వర్ణాంధ్ర 2047' లక్ష్యాలను సాధించడమే మన అందరి ప్రధాన ధ్యేయమని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు. తనకు మంత్రి పదవిని కల్పించిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు, తనను విశ్వసించి గెలిపించిన నిడదవోలు నియోజకవర్గ ప్రజలకు, అలాగే ఈ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించిన అభిమానులు, జనసేనకూటమి కార్యకర్తలకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

**భారీ బైక్ ర్యాలీ – నీరాజనాలు పట్టిన ప్రజలు**

అంతకుముందు విజ్జేశ్వరం నుండి నిడదవోలు వరకు వేలాది మంది అభిమానులతో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. తీవ్రమైన ఎండను సైతం లెక్కచేయకుండా కారు పై నిలబడి దాదాపు 10 కిలోమీటర్ల మేర ప్రజలకు అభివాదం చేస్తూ మంత్రి దుర్గేష్ నిడదవోలు పట్టణంలోకి ప్రవేశించారు.

# కేసీఆర్ కుటుంబానికి అంత భూమి ఎక్కడి నుంచి వచ్చింది: మహేశ్‌గౌడ్



కేసీఆర్ కుటుంబానికి అంత భూమి ఎక్కడి నుంచి వచ్చింది.. విచారణ జరగాల్సిందేనని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్( అన్నారు. గురువారం దిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కేసీఆర్ కుటుంబం భూముల గురించి సీఎం సీఎం రేవంత్‌రెడ్డి చాలా వివరంగా చెప్పారన్నారు. ‘‘2009 ఎన్నికల అఫిడవిట్‌లో కే సీఆర్‌కు భూములు లేవు. 2014 నాటికి 35 ఎకరాలు వచ్చాయి. 2018 నాటికి భూములు పెరగడంతో పాటు.. 2023లో 53 ఎకరాలు చూపించారు. 2026లో కేటీఆర్ 67 ఎకరాలు కొన్నారు. 2023 నాటికి 123 ఎకరాలు కేటీఆర్ కుటుంబం పేరిట వచ్చాయి. అఫిడవిట్‌లో ఉన్న ఆస్తులకు, వాళ్లు చెప్పేవాటికి పొంతన లేదు. 22ఏ విషయంలో ఎక్కడో అధికారుల తప్పిదం ఉండొచ్చు.. దానిపై కూడా విచారణ జరుగుతుంది. బీఆర్ఎస్ నేతలు స్పీకర్ తల్లిపై వాడిన భాష, పోలీసుల పట్ల వారు వ్యవహరించిన తీరు సరికాదు. మహిళా ఎమ్మెల్యేలపై పోలీసులు దాడి చేశారని అంటే నిజమేనేమో అనుకున్నాం.. కానీ తర్వాత వీడియోలు చూస్తే వాళ్ల ఎమ్మెల్యేలే దాడి చేసినట్లు ఉంది. తెలంగాణలో గజం భూమిలేని పేదలు 60 శాతానికి పైగా ఉన్నారు. మీనాక్షి నటరాజన్ ఇన్‌ఛార్జిగా రావడంతో తెలంగాణ కాంగ్రెస్ గ్రాఫ్ పెరిగింది. తెలంగాణకు ఇప్పటి వరకు చేసిన ఇన్‌ఛార్జిలు అందరూ బాగానే చేశారు.


# మనం 2026లో ఉన్నాం.. 'బోనాల' వివాదంపై మరోసారి స్పందించిన నటి

బోనాల సమయంలో తాను ఎదుర్కొన్న విమర్శల గురించి నటి ఫరియా అబ్దుల్లా మరోసారి స్పందించారు. ఆమె తాజా చిత్రం 'సిగ్మా' విడుదల సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఈ విషయం గురించి మాట్లాడారు. సోషల్ మీడియాలో ఎవరి అభిప్రాయాలు వారికి ఉంటాయన్నారు.

"ఇటీవల సోషల్ మీడియాలో నాపై ఎన్నో విమర్శలు వచ్చాయి. అదే వేదికగా నేను కూడా ఆ వివాదంపై నా అభిప్రాయాన్ని తెలియజేశాను. అయితే, ఒక విషయం మాత్రం నన్ను వెంటాడింది. మనం 2026లో జీవిస్తున్నాం. కానీ, ఇంకా చాలామంది పాతకాలం వాళ్లలా ఆలోచిస్తున్నారు. ఆ సమయంలో కొందరి భావజాలం బాధించింది. నేనెప్పుడూ అభ్యుదయ భావాలతో ఆలోచిస్తాను. నా పద్ధతులు నచ్చిన వాళ్లు అనుసరిస్తారు. నచ్చని వాళ్లు విమర్శిస్తారు. ఎవరి అభిప్రాయాలు వాళ్లకు ఉంటాయి. అందరి ఆలోచనలను నేను గౌరవిస్తాను" అని చెప్పారు.

ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన బోనాల సందడిలో ఫరియా అబ్దుల్లా.. పోతురాజుతో కలిసి నృత్యం చేశారు. ఆమె ఈ పండగ చేసుకోవడంపై కొందరు మతం పేరుతో విమర్శించారు. వీటిని ఖండించిన ఫరియా సోషల్ మీడియా వేదికగా నాడు వీడియో విడుదల చేశారు. తాను అంతటా భగవంతుడిని చూస్తానని అన్నారు.

ఇక, సిగ్మా విషయానికొస్తే.. తమిళనాడు ముఖ్యమంత్రి, ప్రముఖ కథానాయకుడు విజయ్ కుమారుడైన జాసన్ సంజయ్ దర్శకుడిగా పరిచయం అవుతున్న చిత్రమిది.



సందీప్‌కిషన్ కథానాయకుడిగా నటించిన ఈ సినిమా అక్టోబర్ 2న ప్రేక్షకుల ముందుకు రానుంది.

# మనకు మనమే శత్రువులం: శోభితా ధూళిపాళ్ల

మనం ఎదుగుతుంటే పక్కవారు చూడలేరంటూ ఓ ఇన్‌ఫ్లూయెన్సర్ పెట్టిన పోస్ట్‌కు నటి శోభితా ధూళిపాళ్ల మద్దతు తెలిపారు. ఎప్పుడూ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే శోభితా.. తాజాగా ఒక పోస్ట్‌కు ఇచ్చిన రిప్లై వైరల్ అవుతోంది. 'మనకు మనమే శత్రువులం' అని తెలుగు వాళ్లను ఉద్దేశించి పెట్టిన వీడియోకు.. ఈ నటి 100 శాతం కరెక్ట్ అంటూ ఎమోజీతో రిప్లై పెట్టారు. ఈ సందర్భంగా తాను ఇండస్ట్రీకి రావాలనుకున్న రోజులను, అప్పుడు తనకు ఎదురైన అనుభవాలను శోభిత పంచుకున్నారు.

'16 ఏళ్ల వయసులోనే నా బ్యాగులు సర్దుకుని ముంబయికి వెళ్లిపోయా. నేను కచ్చితంగా ఈ రంగంలో రాణిస్తాననే నమ్మకం లేదు. అయినా.. ధైర్యంగా అడుగు ముందుకు వేశా. ఎందుకంటే మన సమాజంలో చాలా వరకూ కలలు కనేవారిని, ముఖ్యంగా కొత్తరంగంలోకి అడుగుపెట్టాలనుకునే వారిని ప్రోత్సహించరు. మనం కొత్తగా ఏదైనా పని మొదలు పెడితే.. అప్పటికే ఆ రంగంలో ఉన్నవాళ్లు మనకు మద్దతు ఇవ్వరు. ఈ విషయం మనకు స్పష్టంగా కనిపిస్తుంది. ఇక, ఇలాంటి నూతన అడుగు వేసేది మహిళ అయితే.. ప్రతికూల పరిస్థితులు రెట్టింపు అవుతాయి" అని శోభిత తన రిప్లైలో రాసుకొచ్చారు.

అయితే.. ఇదంతా ఒకప్పటి పరిస్థితి అని శోభిత స్పష్టం చేశారు. "ఇది చాలా కాలం క్రితం జరిగింది. ఇప్పుడు పరిస్థితులు మారాయని ఆశిస్తున్నా. మన సమాజంలో అందరూ ఒకరినొకరు ప్రోత్సహించుకుంటూ ముందుకు సాగాలి. ఇతరులపై ఆధారపడకుండా మీ కోసం మీరు నిలబడేంత మానసిక బలాన్ని పెంపొందించుకోవాలి" అని సూచించారు. 2016లో ఓ హిందీ సినిమాతో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన



శోభితా.. గూఢచారి సినిమాలో సమీరాగా మెప్పించారు. మేజర్, పొన్నియన్ సెల్వన్‌లలో నటించారు. ఒకవైపు సినిమాలు చేస్తూనే వెబ్ సిరీస్‌లతో ఆకట్టుకుంటున్నారు.



# నిస్వార్థ ప్రేమకు 20ఏళ్ల వేడుక

ప్రముఖ నటులు జ్యోతిక, సూర్య తమ 20ఏళ్ల వివాహ వార్షికోత్సవాన్ని ఇటీవల ఘనంగా చేసుకున్నారు. ఈ జంట మరోసారి కుటుంబ సభ్యులు, సన్నిహిత మిత్రుల సమక్షంలో క్రైస్తవ మత పద్ధతిలో పెళ్ళి చేసుకుని... తమ వివాహం నాటి ప్రమాణాలను పునరుద్ధరించుకున్నారు. దీనికి సంబంధించిన ఫొటోలు, వీడియోలను ఇన్‌స్టాలో పంచుకుంటూ ఈ జోడీ.. "ది సీక్వెల్- మా 20ఏళ్ల ప్రేమ, యుద్ధానికి గుర్తుగా ప్రమాణాలను పునరుద్ధరించుకునే వేడుక. ఇది పరిపూర్ణమైన వివాహాన్ని చేసుకునే వేడుక మాత్రమే కాదు.. త్యాగాలు, సర్దుబాట్లు, నిస్వార్థంగా ఒకరినొకరు ప్రేమించుకునేందుకు చేసుకునే వేడుక. ఒకరికోసం మరొకరు మారిన వ్యక్తిత్వాలకు ప్రతీకగా చేసుకునే వేడుక"అనే క్యాప్షన్‌ని జోడించారు. 2006 సెప్టెంబరు 11న సూర్య, జ్యోతికల వివాహం జరిగింది.

# 'సిగ్మా'.. నా పాత్రకు జాసన్ సంజయ్ డబ్బింగ్ చెప్పారు



కోలీవుడ్ అగ్రకథానాయకుడు, తమిళనాడు సీఎం విజయ్ కుమారుడు జాసన్ సంజయ్ దర్శకుడిగా పరిచయమవుతున్న సినిమా 'సిగ్మా' . సందీప్ కిషన్ హీరోగా రూపొందిన ఈ మూవీ అక్టోబరు 2న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో ఇటీవల ఓ ఇంటర్వ్యూలో సందీప్ కిషన్ మాట్లాడారు. సిగ్మా మూవీలో తన పాత్రకు జాసన్ సంజయ్ డబ్బింగ్ చెప్పినట్లు వెల్లడించారు.

" నేను సాధారణంగా ఒకేసారి రెండు, మూడు చిత్రాలు చేయను. ఒకటి పూర్తయ్యాకే మరొకటి చేస్తాను. 'సిగ్మా' షూటింగ్ పూర్తి కాగానే మరో మూవీకి సంబంధించిన పనుల్లో బిజీ అయిపోయాను. దానివల్ల డబ్బింగ్ సమయానికి అందుబాటులో లేను. దీంతో ఫస్ట్ డ్రాఫ్ట్‌లో నా క్యారెక్టర్‌కు జాసన్ సంజయ్ డబ్బింగ్ చెప్పారు. కెమెరా ముందు నేను మాట్లాడే విధానం, నా వాయిస్ మాడ్యులేషన్ కాస్త భిన్నంగా ఉంటుంది. సంజయ్ నా గొంతును అద్భుతంగా దించేశారు. సినిమా విడుదలైన తర్వాత సంజయ్ డబ్బింగ్ చెప్పిన ఆ వెర్షన్‌ను కూడా ప్రేక్షకులతో పంచుకుందామని నేను ఆయనకి చెప్పా" అని సందీప్ కిషన్ తెలిపారు. ఇక, ఈ సినిమాలో ఫరియా అబ్దుల్లా కథానాయికగా నటించగా.. రాజు సుందరం, సంపత్ రాజ్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. తమన్ సంగీతమందించారు.

# నటితో ఎంగేజ్‌మెంట్ క్యాన్సిల్.. ఇన్‌స్టా మొత్తం క్లీన్ చేసిన పృథ్వీషా





భారత యువ క్రికెటర్ పృథ్వీ షా మరోసారి వార్తల్లో నిలిచాడు. నటి ఆకృతి అగర్వాల్‌తో అతడి నిశ్చితార్థం రద్దయ్యింది. ఈ విషయాన్ని వెల్లడిస్తూ ఆకృతి ఇన్‌స్టాలో పోస్ట్ పెట్టింది. మరోవైపు, ఆమె ఈ పోస్ట్ పెట్టిన కాసేపటికే పృథ్వీషా .. తన ఇన్‌స్టాగ్రామ్‌లో దాదాపు మొత్తం పోస్టులను తొలగించడం గమనార్హం. టాలీవుడ్ నటి ఆకృతి అగర్వాల్‌తో మార్చి 8న పృథ్వీ షా ఎంగేజ్‌మెంట్ జరిగింది. అందుకు సంబంధించిన ఫొటోలు వీరిద్దరూ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. అయితే, ఈ నిశ్చితార్థాన్ని రద్దు చేసుకుంటున్నట్లు తాజాగా ఆకృతి ప్రకటించింది. "భవిష్యత్తుకు సంబంధించి మా ఇద్దరి లక్ష్యాలు, పరిస్థితులు విభిన్నంగా ఉన్నాయి. మాకు ఒకరిమీద ఒకరికి ప్రేమ ఉన్నప్పటికీ.. మా దారులు వేరని, ఇక కలిసి ప్రయాణించలేమని అర్థమైంది. బాధ్యతలు, మా చుట్టూ ఉన్న పరిస్థితుల దృష్ట్యా మేం విడి విడిగా ముందుకెళ్లాలని నిర్ణయించుకున్నాం. ఈ సమయంలో మా గోప్యతను అందరూ గౌరవించాలని ఆకాంక్షిస్తున్నా. మా నిర్ణయం వెనుక ఎలాంటి ఊహాగానాలు, అసత్య ప్రచారాలు చేయొద్దని కోరుతున్నా" అని ఆకృతి అగర్వాల్ తన పోస్ట్‌లో రాసుకొచ్చింది.

ఈమె ప్రకటన వెలువడిన కాసేపటికే.. పృథ్వీ షా ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టులన్నీ అదృశ్యమయ్యాయి. ఒక్క 2016 నాటి పోస్ట్ మినహా అన్నింటినీ తొలగించాడు. "నిన్ను నువ్వు పరిచయం చేసుకోవాల్సిన అవసరం లేనంత వరకు పని చేయి" అనే అర్థంతో ఉన్న పోస్ట్ మాత్రమే ఉంచాడు. అయితే, నిశ్చితార్థం రద్దు గురించి మాత్రం పృథ్వీషా ఇంకా స్పందించలేదు.

ఈ ఏడాది జులైలో వీరి బ్రేకప్ గురించి వార్తలు వచ్చాయి. "నేను మోసపోయా. అతడితో కలిసి జీవితంలో ముందుకెళ్లాలని నిర్ణయించుకున్నాక ఇదంతా నమ్మలేకపోతున్నా. అతడి గురించి సామాజిక మాధ్యమాల్లో చూసిందంతా నిజమే. వదంతులన్నీ వాస్తవమే" అంటూ ఆ మధ్య ఆకృతి ఓ పోస్ట్ చేసింది. అందులో పృథ్వీషా పేరును ఆమె ప్రస్తావించనప్పటికీ.. వీరిద్దరి మధ్య బ్రేకప్ జరిగినట్లు ప్రచారం జరిగింది. అయితే, నాడు ఆ వార్తలను ఆకృతి ఖండించింది. తన స్నేహితులను ఉద్దేశించే ఆ పోస్ట్ చేశానని, కాబోయే భర్తతో తాను చాలా సంతోషంగా ఉన్నానని నాడు ఆమె చెప్పింది. ఇప్పుడు రెండు నెలలు తిరగకుండానే.. నిశ్చితార్థాన్ని రద్దు చేసుకుంటున్నట్లు ఆమె ప్రకటించడం గమనార్హం. సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్‌గా పాపులర్ అయిన ఆకృతి.. ఈ ఏడాది విడుదలైన 'త్రిముఖ' సినిమాలో నటించింది.

# ఆసియా గేమ్స్.. చిన్న జట్టుపై అతికష్టంగా గెలిచిన పాక్



ఆసియా క్రీడలను వర్షం ఇబ్బంది పెడుతోంది. ఉదయం జరిగిన క్రికెట్ మ్యాచ్ రద్దవ్వగా.. ఇక రెండో మ్యాచ్‌ను ఓవర్లకు కుదించి ఆడించాల్సిన పరిస్థితి నెలకొంది. చైనా - బంగ్లా మ్యాచ్ టాస్ కూడా పడకుండానే రద్దైంది. దీంతో మెరుగైన ర్యాంకింగ్ కారణంగా బంగ్లా సెమీస్‌లోకి అడుగు పెట్టింది. ఐసీసీ ర్యాంకుల్లో బంగ్లాది 10వ స్థానం. చైనాది 36వ ప్లేస్. దీంతో బంగ్లా నేరుగా సెమీస్‌కు చేరుకుంది. శుక్రవారం భారత్ - జపాన్ విజేతతో బంగ్లా సెమీఫైనల్‌లో తలపడనుంది. మరో క్వార్టర్స్‌లో పాక్ అతికష్టంగా విజయం సాధించింది.

**ఓటమి అంచు వరకూ..**


ఇక రెండో మ్యాచ్‌లో థాయ్‌లాండ్‌తో పాకిస్థాన్ తలపడింది. ఈ మ్యాచ్‌కూ వర్షం అంతరాయం కలిగించింది. ఔట్‌ఫీల్డ్ చిత్తడిగా మారడంతో మ్యాచ్‌ను 11 ఓవర్లకు కుదించారు. తొలుత బ్యాటింగ్ చేసిన థాయ్‌లాండ్ 4 వికెట్ల నష్టానికి 91 పరుగులు చేసింది. లక్ష్యఛేదనలో పాక్ ఇబ్బంది పడింది. ఆసియా కప్‌లో పరాభవంతో తీవ్ర విమర్శలు ఎదుర్కొన్న పాక్‌కు.. మరోసారి అలాంటి పరిస్థితి తప్పదా? అన్నట్లుగా మారింది. అయితే, మరో రెండు బంతులు మాత్రమే మిగిలి ఉండగా అతి కష్టం మీద విజయం సాధించి ఊపిరి పీల్చుకుంది. చివరికి 10.4 ఓవర్లలో 7 వికెట్లను కోల్పోయి 92 పరుగులు చేసి గెలిచింది. శుక్రవారం మలేషియా - శ్రీలంక మ్యాచ్‌లో విజయం సాధించిన జట్టుతో పాకిస్థాన్ సెమీస్‌లో తలపడనుంది.


# నేను రోబోను కాను

తన కెరీర్ గురించి బయటి వాళ్లు ఎవరేమన్నా పట్టించుకోనని టీమ్ఇండియా బ్యాటర్ సంజు శాంసన్ అన్నాడు. "కొన్నిసార్లు వైఫై ఆన్ చేస్తా. మాజీ ఆటగాళ్ల వ్యాఖ్యలు చదువుతా. ఎవరి అభిప్రాయాలు వాళ్లు చెబుతారు. అది మామూలే. వాళ్లు నా గురించి సానుకూల వ్యాఖ్యలు చేయొచ్చు లేదా వ్యతిరేక వ్యాఖ్యలు చేయొచ్చు. నేను పరిణతి సాధించా. ఆ వ్యాఖ్యలు చూసి ఎలా వ్యవహరించాలో నాకు తెలుసు" అని శాంసన్ అన్నాడు. "కొన్నిసార్లు బాధనిపిస్తుంది. నేను రోబోను కాదు. ఆ వ్యాఖ్యలు కచ్చితంగా నాపై ప్రభావం చూపిస్తాయి. కానీ నాకు నేను సర్దిచెప్పకొంటా" అని చెప్పాడు. బయటివాళ్ల మాటలను పట్టించుకుంటే తాను సరిగా బ్యాటింగ్ చేయలేనని శాంసన్ అన్నాడు. తన అంతర్జాతీయ కెరీర్ బాగుందని, ప్రపంచకప్ తనకు ఎంతో ఉపయోగపడిందని అతడు చెప్పాడు. ఓపెనింగ్ స్థానానికి వైభవ్ నుంచి శాంసన్‌కు గట్టి పోటీ ఉన్న సంగతి తెలిసిందే. దీనిపై శాంసన్ స్పందించాడు. "భారత జట్టును నడిపించడం అంత తేలిక కాదు. 15 ఏళ్ల కుర్రాడు ఐపీఎల్‌లో 700-800 పరుగులు చేశాడు. నేను అంతకుముందు ప్రపంచకప్‌లో బాగా ఆడాను. దాని తర్వాత వైభవ్ గొప్పగా ఆడాడు. ఏదో రకంగా అతడు జట్టులోకి రావాల్సిందే" అని చెప్పాడు.

# గంగూలీ బయోపిక్ షూటింగ్.. ఇంగ్లాండ్ క్లబ్‌కు రూ.6 లక్షలు జరిమానా!

ఇంగ్లాండ్‌లోని ఓ కౌంటీ క్లబ్‌కు పడిన జరిమానాకు పరోక్షంగా భారత మాజీ కెప్టెన్ సౌరభ్ గంగూలీ బయోపిక్ షూటింగ్ కారణమైంది. దాదాపు రూ. 6 లక్షల జరిమానాతోపాటు 27 పాయింట్ల కోత పడింది. గత ఆగస్ట్‌లో కౌంటీ ఛాంపియన్‌షిప్ మ్యాచ్ సందర్భంగా పిచ్ నాణ్యత దారుణంగా ఉందని తాజాగా రిపోర్ట్ వచ్చింది. లీసెస్టర్‌షైర్ - గ్లామోర్గాన్ జట్ల మధ్య డివిజన్ 1 మ్యాచ్ జరిగింది. గ్లామోర్గాన్‌పై లీసెస్టర్‌షైర్ 42 పరుగుల తేడాతో విజయం సాధించింది. కానీ, పిచ్ అత్యంత దారుణంగా ఉందని





కౌంటీ క్రమశిక్షణ ప్యానెల్ 'పూర్' రేటింగ్‌ను ఇచ్చింది. అయితే, పిచ్‌ను సరిగ్గా సిద్ధం చేయలేకపోవడానికి పలు కారణాలు ఉన్నాయని గ్రౌండ్స్‌మన్ కాల్లమ్ లూయిన్ తెలిపారు. తొలుత షెడ్యూల్‌లో లేని బాలీవుడ్ సినిమా చిత్రీకరణ కూడా ఒక అంశమని వెల్లడించారు.

"ఆ మ్యాచ్‌కు పది వారాల ముందు రెండు టీ20లు జరిగాయి. దీంతో డివిజన్ 1 మ్యాచ్ కోసం ఈ పిచ్‌నే వాడాం. ఆ సమయంలో వాతావరణం కూడా చాలా ఇబ్బంది పెట్టింది. దాదాపు 35 డిగ్రీల ఎండ ఉంది. అనుకోకుండా బాలీవుడ్‌కు చెందిన ఓ సినిమా చిత్రీకరణ కూడా ఈ మ్యాచ్‌కు నాలుగు రోజుల ముందే ఇక్కడ జరిగింది. దీంతో పిచ్‌మీద పని చేసేందుకు నన్ను అనుమతించలేదు. కనీసం కవర్ చేయడానికీ అవకాశం లేకుండా పోయింది" అని లూయిన్ తెలిపారు. గ్రౌండ్‌మన్ చెప్పిన సినిమా గంగూలీ బయోపిక్ అని క్రికెట్ వర్గాలు పేర్కొన్నాయి. కమిటీ నిర్ణయంపై అప్పీలు చేసుకొనేందుకు లీసెస్టర్‌షైర్‌కు 10 రోజుల సమయం ఉంది. తప్పకుండా దీనిపై రివ్యూ చేయమని కోరతామని క్లబ్ వెల్లడించింది.

PRINTER, PUBLISHER AND OWNED BY SHANKARAGALLU VENKATESULU, AND PRINTED AT FLAT NO 402,4 FLOOR RADHAMADHAV NILAYAM,BESIDE SURYAVAMSHIGARDEN2,SURYAVAMSHI COLONY, PEDDA AMBERPET., RANGAREDDY, TELANGANA 501505. EDITOR : SHANKARAGALLU VENKATESULU. Printing Press M/S. TRIPURA PUBLICATIONS HOUSE NO.: 58518, REVENUE WARD NO: 05, ASHOK NAGAR COLONY, KAMAREDDY (TOWN & POST), MANDAL, TELANGANA 503111. Email: anantha janasakshi2019@gmail.com, Cell : 9533633213, RNI REGD NO : TGTEL/26/A4945